@vaartanews @mvnewstv www.mivaartanews.com
TGBIL/25/A0512
మీ వార్త
AP EDITION
ప్రతి అక్షరం... ప్రజల కోసం
విజయవాడ
ఆదివారం 22 నవంబర్ 2026
సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-



తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో
వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న
మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను

ఆసక్తి అనుభవం కలిగిన వారు
సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్‌లు,
నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు,
మండలాల వారీగా విలేకరులు కావలెను.

సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

కూటమి నిర్ణయమే అంతిమం

- మేల్కొనకపోతే రాజకీయ భవిష్యత్ కోల్పోతారు!
- ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు గట్టి హెచ్చరిక
- పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు
- స్థానిక ఎన్నికల ఫలితాలపై సమగ్ర సమీక్ష
- పదవుల కోసం అలకలు వద్దు.. కూటమి నిర్ణయమే ఫైనల్



అమరావతి

స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు అధికార కూటమిలోని కొందరు ఎమ్మెల్యేల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక హెచ్చరికలు జారీ చేశారు. ప్రజల్లో ఆదరణ తగ్గుతున్నా, పనితీరు మార్చుకోకుండా వ్యవహరిస్తే రాజకీయ భవిష్యత్ ప్రమాదంలో పడుతుందని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు సాధించని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఇప్పటికైనా మేల్కొనాలని సూచించారు. ఎన్నికల ఫలితాలను ప్రతి నియోజకవర్గం వారీగా విశ్లేషిస్తామని, ప్రజల తీర్పును తేలిగ్గా తీసుకోవద్దని హెచ్చరించారు. పనితీరు మార్చుకోని వారిపై అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కొన్ని నియోజకవర్గాల్లో కూటమి ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించకపోవడంపై చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు - మిగతా3లో

12 ఏళ్లలో 50 కోట్ల మంది పేదరికం నుంచి విముక్తి!



- దేశ ఆలోచనా విధానంలో మార్పుతోనే అభివృద్ధి సాధ్యం: ప్రధాని మోదీ
- ఐఐటీ ఖరగ్‌పుర్ వజ్రోత్సవాల్లో ప్రసంగం..
- అంతరిక్ష, సెమీకండక్టర్ రంగాల్లో పురోగతిపై ప్రస్తావన
- పేదరికంపై ఆలోచనా విధానంలో మార్పు



కశ్మీర్ లోయలో ఉగ్రవాదులే లేరు!

- ఆర్టికల్ 370 రద్దుతో వేర్పాటువాదానికి ముగింపు
- పుల్వామా ఎన్‌కౌంటర్‌లో చివరి క్రియాశీల కశ్మీరీ ఉగ్రవాది హతం
- అరుణాచల్ పోలీసులకు ప్రెసిడెంట్స్ పోలీస్ కలర్ ప్రదానం చేసిన కేంద్ర హోంమంత్రి



ఏ.కొండూరులో పులి కలకలం!

సురక్షితంగా పట్టుకోవాలి.. ప్రజలకు రక్షణ కల్పించాలి
అటవీ శాఖకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలు
థర్మల్ డ్రోన్లు, ఏఐ కెమెరాలతో పులి కదలికలపై నిఘా
ఇతర రాష్ట్రాల నిపుణుల సహకారంతో ప్రత్యేక ఆపరేషన్

అమరావతి

ఎన్టీఆర్ జిల్లా ఏ.కొండూరు పరిసర అటవీ ప్రాంతాల్లో పులి సంచారం కలకలం రేపుతోంది. పులి కదలికలతో సమీప గ్రామాల ప్రజల్లో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. పులిని సురక్షితంగా పట్టుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ - మిగతా3లో

ఏపీకి రూ.38,362 కోట్ల పెట్టుబడులు!

- 20,398 మందికి ఉపాధి అవకాశాలు..
- పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో చర్చ
- కియాతో రూ.19 వేల కోట్ల పెట్టుబడి
- అచ్యుతాపురంలో గ్లాస్ తయారీ ప్లాంట్
- కియా, అదానీ, సెయింట్-గోబైన్ సహా పలు సంస్థల ప్రతిపాదనలు



100 రోజులైనా ముగియని పార్లమెంట్ సమావేశాలు!

- డీలిమిటేషన్ బిల్లు కోసమే జాప్యం.. మోదీ సర్కారుపై కాంగ్రెస్ విమర్శలు
- మూడింట రెండొంతుల మెజారిటీ కోసం ప్రయత్నాలు: జైరాం రమేశ్ ఆరోపణ
- ప్రస్తుత లోక్‌సభ స్థానాలతోనే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్



ప్రజల భాగస్వామ్యంతో గోదావరి పుష్కరాలు!

- 10 కోట్ల మంది భక్తుల రాకే లక్ష్యం
- రూ.3,723 కోట్లతో భారీ ఏర్పాట్లు
- 440 ఘాట్ల అభివృద్ధి.. 4 వేల ప్రత్యేక బస్సులు
- 1,560 ప్రత్యేక రైళ్లు.. 135 భాషల్లో ఏఐ చాట్‌బాట్
- పుష్కరాల ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి:

గోదావరి పుష్కరాలను కనీవినీ ఎరుగని రీతిలో వైభవంగా నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. సుమారు 10 కోట్ల మంది భక్తులు పుష్కరాలకు తరలివస్తారన్న అంచనాతో పకడ్బందీ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మౌలిక సదుపాయాలు, రవాణా, భద్రత, వైద్య సేవలు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పుష్కరాల నిర్వహణలో ప్రభుత్వ శాఖల తో పాటు స్వచ్ఛంద సంస్థలు, యువత, మహిళా సంఘాలు, స్థానిక ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. ఈ మేరకు అధికారులతో నిర్వహించిన సమీక్షలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు గోదావరి పుష్కరాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించారు. మొత్తం 12 రోజుల పాటు జరిగే ఈ ఆధ్యాత్మిక వేడుకలకు దేశవ్యాప్తంగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో - మిగతా3లో



అయ్యప్ప భక్తులకు గుడ్ న్యూస్

- విమానం క్యాబిన్ లోకి ఇరుముడి తీసుకువెళ్లొచ్చు!
- విమానాల్లో ఇరుముడికి కేంద్ర పౌర విమానయాన శాఖ అనుమతి
- వరుసగా మూడో ఏడాది భక్తులకు వెసులుబాటు కల్పించిన కేంద్రం
- క్యాబిన్ బ్యాగేజీగా ఇరుముడి తీసుకెళ్లేందుకు గ్రీన్‌సిగ్నల్
- విమానాశ్రయాలు, సీఐఎస్ఎఫ్ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు

కరవు సీమలో పరిశ్రమల జోరు



- రాయలసీమలో రిలయన్స్ భారీ పారిశ్రామిక అడుగు!
- 12 నెలల్లోనే ఉత్పత్తి ప్రారంభం..
- ఓర్వకల్లులో ఆసియాలోనే అతిపెద్ద పానీయాల తయారీ కేంద్రం
- 10 ఉత్పత్తి లైన్లతో క్యాంపా కోలా, పండ్ల రసాలు, ప్యాకేజ్డ్ వాటర్ తయారీ
- 1,200 మందికి ప్రత్యక్షంగా ఉపాధి
- దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు కర్నూలు నుంచే సరఫరా



కల్తీ మద్యం మరణాలు ప్రమాదం కాదు.. ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం!

- బీజేపీ ప్రభుత్వంపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు
- మణిపూర్‌లో విషాదం..
- 15 మంది మృతి, 150 మందికిపైగా ఆస్పత్రిలో చికిత్స
- బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి..
- దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

12 ఏళ్లలో 50 కోట్ల మంది పేదరికం నుంచి విముక్తి!

ప్రపంచంలో భారత్ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధిస్తోందని, ఆలోచనా విధానంలో వచ్చిన మార్పుతోనే దేశం అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు వేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గత 12 ఏళ్లలో దేశంలో సుమారు 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని వెల్లడించారు. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం ఈ పురోగతి సాధ్యమైందని పేర్కొన్నారు. ఆలోచనల్లోని పరిమితులను అధిగమించినప్పుడే దేశం తన అసలైన సామర్థ్యాన్ని గుర్తించగలదని చెప్పారు. ఐఐటీ ఖరగ్‌పుర్ వజ్రోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని.. సంస్థ 75 ఏళ్ల ప్రస్థానానికి గుర్తుగా ప్రత్యేక స్మారక నాణేన్ని ఆవిష్కరించారు. ఒకప్పుడు స్వాతంత్ర్య సమరయోధులను నిర్బంధించిన శిబిరంగా ఉన్న ఈ ప్రాంగణం నేడు ఆకాంక్షల నుంచి ఆత్మనిర్భరత వైపు భారత్ సాగిస్తున్న ప్రయాణానికి ప్రతీకగా నిలుస్తోందని కొనియాడారు.

పేదరికంపై ఆలోచనా విధానంలో మార్పు

ఒకప్పుడు పేదరికాన్ని శాశ్వత సమస్యగా భావించేవారని మోదీ వ్యాఖ్యానించారు. ఐదు దశాబ్దాల క్రితం నుంచే పేదరిక నిర్మూలన నినాదాలు వినిపించినప్పటికీ, వాటికి అనుగుణంగా విధానపరమైన చర్యలు తీసుకోవడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. దేశ జనాభా ఎక్కువగా ఉండటంతో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడం సాధ్యం కాదనే భావన అప్పట్లో ఉండేదని అన్నారు. తమ ప్రభుత్వం ఆ ఆలోచనా ధోరణిని మార్చి పేదలకు సాధికారత కల్పించే దిశగా చర్యలు చేపట్టిందని వివరించారు.

మరుగుదొడ్ల నిర్మాణంపైనా విమర్శలు

తొలిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎర్రకోట నుంచి చేసిన ప్రసంగాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. పేదల కోసం మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తానని



ప్రకటించినప్పుడు విమర్శలు ఎదురయ్యాయని తెలిపారు. ప్రధానమంత్రి మరుగుదొడ్ల గురించి మాట్లాడటమేంటని పార్లమెంటులో కొందరు ఎగతాళి చేశారని చెప్పారు. అయితే పేదలకు, ముఖ్యంగా మహిళలకు, తల్లులకు మరుగుదొడ్ల అవసరం ఎంత ఉందో విమర్శించినవారు గుర్తించలేకపోయారని పేర్కొన్నారు. అధికారాన్ని ప్రజల సాధికారతకు ఉపయోగించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

దేశమే ప్రథమం కావాలి

ఐఐటీ ఖరగ్‌పుర్ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు దేశమే ప్రథమం అనే భావనతో ముందుకు సాగాలని ప్రధాని పిలుపునిచ్చారు. వారి ప్రతిభ, పరిశోధనలు దేశ అభివృద్ధికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. గత 75 ఏళ్లుగా ఐఐటీ ఖరగ్‌పుర్ దేశానికి విశేష సేవలు అందించిందని ప్రశంసించారు. సంస్థ వందో వార్షికోత్సవం అభివృద్ధి చెందిన భారత్‌లో జరిగేలా విద్యార్థులు, అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు.

యువతకు అంతరిక్ష రంగంలో అవకాశాలు

భారత అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థలు, స్టార్టప్‌లకు ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తోందని మోదీ తెలిపారు. గతంలో ప్రభుత్వ సంస్థలకే పరిమితమైన ఈ రంగాన్ని యువతకు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఐఐటీ ఖరగ్‌పుర్ పూర్వ విద్యార్థి పవన్ కుమార్ చందన స్థాపించిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థను ఈ సందర్భంగా ప్రస్తావించారు. భారత్ తొలి ప్రైవేటు రాకెట్ అభివృద్ధి, ప్రయోగంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. అనేక అంతరిక్ష స్టార్టప్‌లు దేశ అంతరిక్ష కార్యక్రమానికి కొత్త దిశానిర్దేశం చేస్తున్నాయని అన్నారు.

సెమీకండక్టర్ రంగంలో ముందడుగు

సెమీకండక్టర్ తయారీలో భారత్ సాధిస్తున్న పురోగతిని ప్రధాని వివరించారు. సుమారు ఐదు దశాబ్దాల క్రితం ఒక సంస్థ సెమీకండక్టర్ల తయారీకి భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చినా, అప్పట్లో ఆ ప్రతిపాదనకు అవకాశం కల్పించలేదని గుర్తుచేశారు. దీంతో దేశం కీలక మైన అవకాశాన్ని కోల్పోయిందన్నారు. తాము సెమీకండక్టర్ మిషన్‌ను ప్రారంభించినప్పుడు ఆలస్యమైందంటూ విమర్శలు వచ్చినప్పటికీ వెనక్కి తగ్గలేదని చెప్పారు. ప్రస్తుతం దేశంలో చిప్ తయారీ రంగం అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు.

పరిమిత ఆలోచనలను అధిగమించాలి

వ్యక్తులు తమ కలలకు, ప్రతిభకు తామే హద్దులు విధించుకోవద్దని మోదీ సూచించారు. ఇలాంటి పరిమిత ఆలోచనలు వ్యక్తుల ఎదుగుదలతో పాటు దేశ పురోగతిని కూడా అడ్డుకుంటాయని అన్నారు. మన ఆలోచనల పరిధినే ప్రపంచపు పరిధిగా భావించకూడదని పేర్కొన్నారు. కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే స్తబ్ధతను వీడి వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశం తన ఆలోచనా హద్దులను అధిగమించినప్పుడే పూర్తి సామర్థ్యాన్ని చాటుకోగలదని స్పష్టం చేశారు.

అయ్యప్ప భక్తులకు గుడ్ న్యూస్..

భక్తుల మనోభావాలను గౌరవిస్తూ నిర్ణయం తీసుకున్నామన్న మంత్రి రామ్మోహన్ నాయుడు

శబరిమల యాత్ర చేపట్టే అయ్యప్ప భక్తులకు కేంద్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. విమానాల్లో ప్రయాణించే సమయంలో పవిత్రమైన 'ఇరుముడి'ని క్యాబిన్ బ్యాగేజీగా తమ వెంట తీసుకెళ్లేందుకు అనుమతి మంజూరు చేసింది. భక్తుల మనోభావాలు, సాంప్రదాయాలను గౌరవిస్తూ వరుసగా మూడో ఏడాది కూడా ఈ సడలింపును కొనసాగిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అధికారికంగా వెల్లడించారు.

శతాబ్దాలుగా అయ్యప్ప స్వామి భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఇరుముడిని వెంట తీసుకెళ్లడం ఆచారంగా వస్తోందని మంత్రి పేర్కొన్నారు. అయ్యప్ప స్వాములు తమ పవిత్ర యాత్రను ఎటువంటి అసౌకర్యాలు లేకుండా సాఫీగా కొనసాగించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ క్రమంలో బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (దీజూూ), సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (జ×ూఖీ)తో పాటు విమానాశ్రయాల నిర్వాహకులకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. పవిత్ర దీక్ష చేపట్టి యాత్రకు బయలుదేరే భక్తులందరికీ స్వామివారి ఆశీస్సులు ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ నిర్ణయానికి సంబంధించి కేంద్ర పౌర విమానయాన శాఖ అధికారిక ఉత్తర్వులను కూడా జారీ చేసింది. విమానాల్లో భద్రతా కారణాల దృష్ట్యా సాధారణంగా నిషేధించే వస్తువుల జాబితా నుంచి ఇరుముడికి మినహాయింపునిస్తూ గతంలో



ఇచ్చిన ఆదేశాలు ఈ సీజన్‌లోనూ అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఈ మేరకు అన్ని విమానాశ్రయాల రీజినల్ కార్యాలయాలు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ూూ×), ప్రైవేట్ ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్లు నిబంధనలను పక్కాగా అమలు చేయాలని ఆదేశించింది. సాధారణంగా ఇరుముడిలో నెయ్యి నింపిన కొబ్బరికాయ, కర్పూరం వంటి పూజా ద్రవ్యాలు ఉంటాయి. విమానయాన భద్రతా నిబంధనల ప్రకారం ద్రవ పదార్థాలు, మండే స్వభావం గల వస్తువులను క్యాబిన్‌లోకి అనుమతించరు. అయితే శబరిమల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, భక్తుల భక్తి భావాలను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక మినహాయింపు ఇచ్చింది. విమానాల్లో ప్రయాణించే వేలాది మంది భక్తులకు ఈ నిర్ణయం ఎంతో ప్రయోజనకరంగా మారనుంది.

100 రోజులైనా ముగియని పార్లమెంట్ సమావేశాలు!

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడి 100 రోజులు గడిచినా, ఇప్పటివరకు అధికారికంగా ప్రోరోగ్ కాకపోవడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర విమర్శలు చేసింది. డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకునేందుకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజారిటీ సాధించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. దేశం 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని చేరుకునే వరకు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను వాయిదా వేయాలని సూచించారు. అదే సమయంలో ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య ఆధారంగానే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

డీలిమిటేషన్‌ను వాయిదా వేయాలి

సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా జైరాం రమేశ్ స్పందించారు. వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడి 100 రోజులు పూర్తయినా, అధికారికంగా ముగియకపోవడంపై ప్రశ్నలు లేవనెత్తారు. డీలిమిటేషన్ బిల్లులోని ప్రతిపాదనలపై కేంద్ర ప్రభుత్వం ఏ రాజకీయ పార్టీతోనూ సమగ్రంగా చర్చించలేదని ఆరోపించారు. ఈ అంశంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని మోదీకి నాలుగు లేఖలు రాసినా అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయలేదని విమర్శించారు. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక, రాజకీయ, సామాజిక, సైనిక, విదేశాంగ సవాళ్లపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు.

గతంలోనూ పునర్విభజన వాయిదా

నియోజకవర్గాల పునర్విభజనను గతంలోనూ వాయిదా వేసిన సందర్భాలున్నాయని జైరాం రమేశ్ గుర్తుచేశారు. 1976లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ డీలిమిటేషన్‌ను 25 ఏళ్లపాటు



వాయిదా వేశారని, 2001లో అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి మరో 25 ఏళ్లపాటు వాయిదాను పొడిగించారని తెలిపారు. వారిద్దరూ వివేకవంతమైన నిర్ణయాలు తీసుకున్నారని వ్యాఖ్యానించారు. నియోజకవర్గాల పునర్విభజన వంటి కీలక అంశాలపై ప్రశాంత వాతావరణంలో చర్చలు జరగాలని, అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు.

మోదీ ప్రసంగంపై జైరాం రమేశ్ వ్యాఖ్యలు

నవంబర్ 19న ఫిక్కీ సమావేశంలో ప్రధాని మోదీ చేసిన ప్రసంగంపైనా జైరాం రమేశ్ స్పందించారు. దేశ ఆర్థిక పరిస్థితిపై ప్రధాని తీవ్ర ఆందోళనతో ఉన్నట్లు కనిపించారని వ్యాఖ్యానించారు. ఆర్థిక వ్యవస్థపై ఇంతటి ఆందోళన ఉన్నప్పుడు కీలకమైన డీలిమిటేషన్ ప్రక్రియపై చర్చించేందుకు ప్రశాంతమైన వాతావరణం అవసరమని అభిప్రాయపడ్డారు.

ప్రోరోగ్ జాప్యంలో కొత్త రికార్డు

ఈ ఏడాది ఆగస్టు 13న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. అయితే ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడినప్పటికీ అధికారికంగా ప్రోరోగ్ చేయలేదు. గతంలోనూ ఇలాంటి సందర్భాలు ఉన్నప్పటికీ ప్రస్తుత జాప్యం కొత్త రికార్డుగా నిలిచింది. గతంలో 2008లో 87 రోజులు, 1987లో 76 రోజులు, 1989లో 54 రోజులు, 2006, 2013లో 49 రోజులు, 1963లో 41 రోజుల పాటు సమావేశాలు ప్రోరోగ్ కాలేదు. తాజా పరిణామంతో ఈ రికార్డులన్నీ అధిగమించబడ్డాయి. మహిళా రిజర్వేషన్ చట్టం అమలుకు అవసరమైన రాజ్యాంగ సవరణలు, డీలిమిటేషన్ అంశాల నేపథ్యంలో సమావేశాలను అధికారికంగా ముగించకపోవడంపై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది.

కల్తీ మద్యం మరణాలు ప్రమాదం కాదు.. ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం!



మణిపూర్‌లోని చందేల్ జిల్లాలో కల్తీ మద్యం సేవించి పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ఈ మరణాలు అనుకోకుండా జరిగిన ప్రమాదం కాదని, బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్య ఫలితమని ఆరోపించారు. విషపూరిత మద్యం కారణంగా పలువురు మరణించారన్న వార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు.

ప్రభుత్వం ఇంకా నిద్రపోతోందా?

సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించిన రాహుల్ గాంధీ.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మణిపూర్‌లో గతంలో జరిగిన హింసాకాండ వందలాది కుటుంబాలను తీవ్రంగా దెబ్బతీసిందని, ఇప్పుడు కల్తీ మద్యం ఘటన మరిన్ని కుటుంబాల్లో విషాదాన్ని నింపిందని విమర్శించారు. అయినప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఘటనకు బాధ్యులైన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు తగిన పరిహారం, పూర్తి సహాయ సహకారాలు అందించాలని డిమాండ్ చేశారు.

15 మంది మృతి.. 150 మందికిపైగా బాధితులు

చందేల్ జిల్లాలోని చక్పి కరోంగ్, పరిసర ప్రాంతాల్లో స్థానికంగా తయారు చేసిన మద్యం సేవించడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. మద్యంలో మెథనాల్ అనే విషపూరిత రసాయనం కలవడం వల్లే మరణాలు సంభవించి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. గత రెండు మూడు రోజులుగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనలో ఇప్పటివరకు కనీసం 15 మంది మరణించినట్లు సమాచారం. ఇంఫాల్‌లోని షిజా ఆస్పత్రిలో 150 మందికిపైగా బాధితులు చేరి చికిత్స పొందుతున్నారు. బబినా ఆస్పత్రిలోనూ పలువురికి వైద్య సేవలు అందిస్తున్నారు. బాధితుల్లో ఎక్కువ మంది మధ్యవయస్కులు, యువకులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

ఆస్పత్రుల్లో బాధితులను పరామర్శించిన సీఎం

మరోవైపు మణిపూర్ ముఖ్యమంత్రి యుమ్నామ్ ఖేమ్‌చంద్ సింగ్ శుక్రవారం ఇంఫాల్‌లోని షిజా, బబినా ఆస్పత్రులను సందర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రత్యేక వైద్య బృందంతో పాటు అత్యవసర మందులను చందేల్ జిల్లాకు పంపించారు. ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. బాధితులకు ఆర్థిక సాయం అందిస్తామని భరోసా కల్పించారు.

అక్రమ మద్యం తయారీపై విచారణ

కల్తీ మద్యం తయారీ వెనుక ఎవరున్నారు? విషపూరిత మెథనాల్ ఎక్కడ కలిసింది? అక్రమ మద్యం సరఫరా వ్యవస్థలో ఎవరెవరి పాత్ర ఉంది? అనే కోణాల్లో అధికారులు దర్యాప్తు చేపట్టాల్సి ఉంది. మరోవైపు అనుమానాస్పద నాటుసారాను సేవించవద్దని, అక్రమ మద్యం తయారీ కేంద్రాల సమాచారం తెలిస్తే అధికారులకు తెలియజేయాలని చందేల్ జిల్లా యంత్రాంగం ప్రజలకు సూచించింది. బాధితులకు వైద్య సహాయం అందించడంతో పాటు ఈ ఘటనకు కారణమైన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

కశ్మీర్ లోయలో ఉగ్రవాదులే లేరు!



కశ్మీర్ లోయలో ప్రస్తుతం క్రియాశీల కశ్మీరీ ఉగ్రవాదులు ఎవరూ మిగలలేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఇటీవల పుల్వామాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిబాతో సంబంధం ఉన్న చివరి క్రియాశీల కశ్మీరీ ఉగ్రవాదిని భద్రతా దళాలు హతమార్చాయని వెల్లడించారు. 2019లో ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత కశ్మీర్‌లో పరిస్థితులు గణనీయంగా మారాయని పేర్కొన్నారు. శనివారం అరుణాచల్ ప్రదేశ్‌లోని బందర్‌దేవాలో ఉన్న పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా అరుణాచల్ ప్రదేశ్ పోలీసులకు ప్రతిష్టాత్మకమైన 'ప్రెసిడెంట్స్ పోలీస్ కలర్' పురస్కారాన్ని అందజేశారు.

ఉగ్రవాదానికి చరమగీతం: అమిత్ షా

1990లో కశ్మీర్‌లో ఉగ్రవాదం తీవ్రస్థాయికి చేరుకుందని అమిత్ షా గుర్తుచేశారు. అప్పట్లో కశ్మీర్‌ను భారత్‌లో అంతర్భాగంగా కొనసాగించగలమా అనే ఆందోళనలు వ్యక్తమయ్యాయని చెప్పారు. ఆ సమయంలో అప్పటి ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా ఇంగ్లాండ్‌కు వెళ్లిపోయారని, క్లిష్ట పరిస్థితుల్లో భద్రతా దళాలు చూపిన ధైర్యసాహసాలే కశ్మీర్‌ను దేశంతో ఐక్యంగా ఉంచాయని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో భద్రతా బలగాల పాత్ర ఎనలేనిదని ప్రశంసించారు.

ఆర్టికల్ 370 రద్దుతో మార్పు

2019లో ఆర్టికల్ 370 రద్దు చేసినప్పుడు ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శించాయని అమిత్ షా అన్నారు. ఆర్టికల్ 370కి, ఉగ్రవాదానికి సంబంధం ఏమిటని ప్రశ్నించాయని గుర్తు చేశారు. అయితే ఆ నిర్ణయం కశ్మీర్ యువతలో వేర్పాటువాద భావజాలాన్ని బలహీనపరిచిందని పేర్కొన్నారు. ప్రస్తుతం కశ్మీర్ లోయలో ఒక్క క్రియాశీల కశ్మీరీ యువ ఉగ్రవాది కూడా లేడని ప్రకటించారు. ఈ పరిణామం దేశ ప్రజలందరికీ గర్వకారణమని అన్నారు.

అరుణాచల్ పోలీసుల సేవలకు గుర్తింపు

అరుణాచల్ ప్రదేశ్ పోలీసులు అంతర్గత భద్రతా సవాళ్లు, తిరుగుబాటు, వ్యవస్థీకృత నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సైబర్ నేరాలను సమర్థంగా ఎదుర్కొంటున్నారని అమిత్ షా ప్రశంసించారు. వారి సేవలను గుర్తిస్తూ ప్రతిష్టాత్మకమైన 'ప్రెసిడెంట్స్ పోలీస్ కలర్' పురస్కారాన్ని అందజేశారు. ఈ గౌరవం పోలీసు సిబ్బందికి, రాష్ట్ర ప్రజలకు, నాయకత్వానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ పురస్కారం మరింత బాధ్యతతో పనిచేసేందుకు పోలీసులకు స్ఫూర్తినిస్తుందని అన్నారు.

ఈశాన్యానికి అభివృద్ధి బాట

2014 నుంచి ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈశాన్య రాష్ట్రాల్లో అభివృద్ధి కొత్త దశకు చేరుకుందని అమిత్ షా అన్నారు. ఈశాన్య ప్రాంతానికి కేంద్ర ప్రభుత్వం ఏమి చేసిందని కాంగ్రెస్ నేతలు ప్రశ్నించినప్పుడల్లా తనకు చిరునవ్వు వస్తుందని వ్యాఖ్యానించారు. అరుణాచల్ ప్రదేశ్‌లో అభివృద్ధికి కొత్త శకం ప్రారంభమైందని తెలిపారు. 'సూర్యుడు ఉదయించే భూమి'గా పేరొందిన అరుణాచల్ ప్రదేశ్‌లో శాంతి, భద్రత, అభివృద్ధి దేశానికి ఎంతో ముఖ్యమని స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు శాశ్వత శాంతి నెలకొల్పేందుకు కేంద్రం కృషి చేస్తోందని వెల్లడించారు.

కూటమి నిర్ణయమే అంతిమం

-మొదటిపేజీ తరువాయి

నిర్వహిస్తున్నవారు ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారి సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపాలని సూచించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును విశ్లేషించుకుని ఎక్కడ తప్పులు జరిగాయో గుర్తించాలని ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. కొందరు ప్రజాప్రతినిధుల పనితీరును ప్రజలు ఆమోదించడం లేదనే విషయాన్ని ఎన్నికల ఫలితాలు సూచిస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా తమ వ్యవహారశైలిని మార్చుకోవాలని హెచ్చరించారు.

ప్రతి ఫలితంపైనా సమీక్ష

స్థానిక ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను నియోజకవర్గాల వారీగా పరిశీలించనున్నట్లు సీఎం స్పష్టం చేశారు. కేవలం గెలుపోటములకే పరిమితం కాకుండా, ఓటర్ల అభిప్రాయాలు, స్థానిక సమస్యలు, నాయకుల పనితీరు, కార్యకర్తలతో సమన్వయం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు. ప్రజల్లో వ్యతిరేకత ఉన్నప్పటికీ దాన్ని గుర్తించకుండా ముందుకు సాగితే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పార్టీకి నష్టం కలిగించే విధంగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

పంచాయతీ ఎన్నికలపై దృష్టి

రాబోయే పంచాయతీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. కూటమి బలపరిచిన అభ్యర్థుల విజయానికి ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో పార్టీ బలాన్ని పెంచుకోవడంతో పాటు ప్రజల సమస్యలపై నిరంతరం స్పందించాలని ఆదేశించారు. కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు సైతం తమ పరిధిని దాటి వ్యవహరించకూడదని, బాధ్యతలను గుర్తుంచుకుని పనిచేయాలని సూచించారు.



పరిషత్ పీఠాల కోసం పంతాలు వద్దు

మరోవైపు కూటమిలో పరిషత్ పదవుల కేటాయింపు వ్యవహారం కూడా రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. జడ్పీ చైర్మన్, ఎంపీపీ పదవుల కోసం కొన్ని ప్రాంతాల్లో కూటమి పార్టీల నేతల మధ్య విభేదాలు బయటపడుతున్నాయి. ముఖ్యంగా కడప జడ్పీ చైర్మన్ పదవి విషయంలో బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. శ్రీకాళహస్తి ఎంపీపీ పదవి విషయంలో టీడీపీ, బీజేపీ నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఎన్నిక వాయిదా పడిన పరిస్థితి నెలకొంది. పరిషత్ పదవుల విషయంలో వ్యక్తిగత పట్టుదలకు తావులేదని, కూటమి సమష్టిగా తీసుకునే నిర్ణయమే అంతిమమని చంద్రబాబు స్పష్టం చేసినట్లు సమాచారం. పదవుల కోసం అలకలు ప్రదర్శించడం, బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయడం సరికాదని హితవు పలికారు. టీడీపీలోనూ కొందరు నేతలు పదవుల విషయంలో అసంతృప్తితో ఉన్నారని పేర్కొంటూ, వారికి కౌన్సెలింగ్ ఇస్తామని తెలిపారు. అయినప్పటికీ వైఖరి మార్చుకోకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వ్యవహారశైలిపైనా అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం.

క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యలే

ఒకవైపు ఎమ్మెల్యేల పనితీరుపై సమీక్ష, మరోవైపు కూటమి నేతల మధ్య పదవుల వివాదాలు.. ఈ రెండు అంశాలపై చంద్రబాబు స్పష్టమైన వైఖరి ప్రకటించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజల్లో ఆదరణ పెంచుకోవడం, కార్యకర్తలకు అండగా నిలవడం, కూటమి ఐక్యతను కాపాడటం ఎమ్మెల్యేల ప్రధాన బాధ్యతలని అధిష్ఠానం భావిస్తోంది. ఎన్నికల ఫలితాల నుంచి పాఠాలు నేర్చుకోకుండా, పదవుల కోసం పరస్పరం విభేదిస్తే భవిష్యత్తులో రాజకీయంగా నష్టపోవాల్సి వస్తుందని చంద్రబాబు హెచ్చరించినట్లు తెలుస్తోంది.

ప్రజల భాగస్వామ్యంతో గోదావరి పుష్కరాలు!

-మొదటిపేజీ తరువాయి

ముందస్తు ఏర్పాట్లపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. పుష్కరాల నిర్వహణ కోసం 22 ప్రభుత్వ శాఖల పరిధిలో మొత్తం 4,862 పనులను ప్రతిపాదించారు. ఇందుకోసం రూ.3,723 కోట్లకు పైగా వ్యయాన్ని అంచనా వేశారు. ఇప్పటివరకు రూ.2,051 కోట్ల విలువైన 2,260 పనులకు పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. పనులన్నీ నిర్దిష్ట గడువులో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం ఆదేశించారు.

440 ఘాట్లలో మౌలిక సదుపాయాలు

గోదావరి పరివాహక ప్రాంతంలోని 440 ఘాట్ల వద్ద భక్తులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించనున్నారు. స్నానఘట్టాల అభివృద్ధి, రహదారులు, తాగునీరు, విద్యుత్ దీపాలు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఇప్పటికే రూ.649 కోట్ల విలువైన 659 పనులు ప్రారంభమయ్యాయి. పారిశుద్ధ్యం, తాగునీరు, లైటింగ్, మరుగుదొడ్ల ఏర్పాట్ల కోసం మరో రూ.464 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఘాట్ల వద్ద నిరంతర పర్యవేక్షణ ఉండేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక

పుష్కరాల సమయంలో భారీగా వాహనాలు, భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ రహదారులను అభివృద్ధి చేయనున్నారు. సుమారు 268 కిలోమీటర్ల మేర బారికేడ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వాహనాల పార్కింగ్, భక్తుల రాకపోకలు, ఘాట్లకు చేరుకునే మార్గాలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నారు. రద్దీ ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టనున్నారు.

4 వేల బస్సులు.. 1,560 ప్రత్యేక రైళ్లు

భక్తుల రవాణా సౌకర్యం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. సుమారు 4 వేల ప్రత్యేక బస్సులతో పాటు 649 గ్రీన్ బస్సులను నడిపేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. రైల్వే శాఖతో సమన్వయం చేసుకుని 1,560 ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రధాన రైల్వే స్టేషన్లు, బస్టాండ్ల నుంచి పుష్కర ఘాట్లకు చేరుకునేందుకు అనుసంధాన రవాణా సౌకర్యాలు కల్పించనున్నారు. రద్దీకి అనుగుణంగా బస్సులు, రైళ్ల సంఖ్యను సర్దుబాటు చేయనున్నారు.

135 భాషల్లో ఏఐ చాట్‌బాట్ సేవలు

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని పుష్కరాల నిర్వహణను మరింత సమర్థంగా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ఆధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. భక్తులకు సమాచారం అందించేందుకు 135 భాషల్లో సేవలందించే ఏఐ చాట్‌బాట్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఘాట్ల వివరాలు, రవాణా మార్గాలు, వైద్య సేవలు, వసతి సౌకర్యాలు, ఇతర అవసరమైన సమాచారాన్ని ఈ వ్యవస్థ ద్వారా తెలుసుకునే అవకాశం కల్పించనున్నారు. పుష్కరాల సమయంలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకునేలా కమాండ్ కంట్రోల్ వ్యవస్థ పనిచేయనుంది.



వైద్య సేవలకు పెద్దపీట

పుష్కరాలకు వచ్చే కోట్లాది మంది భక్తుల ఆరోగ్య భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో అదనంగా 100 పడకలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఘాట్ల సమీపంలో వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లు, అత్యవసర చికిత్సా కేంద్రాలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోనున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్య సమస్యలున్న భక్తులకు ప్రత్యేక వైద్య సహాయం అందించే విధంగా ప్రణాళికలు రూపొందించనున్నారు.

పోలవరం, కాటన్ బ్యారేజీ పనులపై దృష్టి

పుష్కరాల నేపథ్యంలో గోదావరి పరివాహక ప్రాంతంలో కీలకమైన సాగునీటి ప్రాజెక్టులు, మౌలిక వసతుల పనులను కూడా వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ ఆధునికీకరణ పనులను 2027 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే పుష్కరాల కంటే ముందే పోలవరం ప్రాజెక్టు పనులను పూర్తి చేసి ప్రారంభించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ పనులు పూర్తయితే గోదావరి ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

జలమార్గంలో ఫ్లోటింగ్ పంటూన్లు

రాజమహేంద్రవరం నుంచి పోలవరం వరకు సుమారు 40 కిలోమీటర్ల జలమార్గంలో ఆరు ఫ్లోటింగ్ పంటూన్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. జలరవాణా సౌకర్యాలను వినియోగించుకోవడంతో పాటు పర్యాటక పరంగా కూడా ఈ మార్గాన్ని అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు. భక్తుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ జలమార్గంలో అవసరమైన రక్షణ ఏర్పాట్లు చేయనున్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం

పుష్కరాల సమయంలో గోదావరి నది కాలుష్యానికి గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నదిలో వ్యర్థాలు వేయకుండా అవగాహన కల్పించడం, ఘాట్ల వద్ద నిరంతర పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టనున్నారు. గోదావరి జలాల నాణ్యతను కాపాడటంతో పాటు పర్యావరణహిత పుష్కరాల నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు.

ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు

పుష్కరాలను కేవలం పుణ్యస్నానాలకే పరిమితం చేయకుండా ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని చాటేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గోదావరి నదీ హారతి, సామూహిక కూచిపూడి నృత్య ప్రదర్శనలు, దీపాలంకరణ, యోగా కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. స్థానిక కళాకారులు, సాంస్కృతిక సంస్థలు, యువతకు ఇందులో భాగస్వామ్యం కల్పించనున్నారు.

ప్రజల భాగస్వామ్యమే కీలకం

పుష్కరాల నిర్వహణలో ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ప్రజల సహకారం ఎంతో ముఖ్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తులకు సేవలందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భారీ జనసందోహం వచ్చినా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఏపీకి రూ.38,362 కోట్ల పెట్టుబడులు!

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడులు తరలివచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కియా, అదానీ ఎంటర్‌ప్రైజెస్, సెయింట్-గోబైన్ వంటి ప్రముఖ సంస్థలతో పాటు పలు కంపెనీలు రాష్ట్రంలో పరిశ్రమలు, హోటళ్లు, ఇతర ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆసక్తి చూపించాయి. మొత్తం రూ.38,362.12 కోట్ల పెట్టుబడులకు ప్రతిపాదనలు సమర్పించగా, వీటి ద్వారా 20,398 మందికి ఉపాధి లభించే అవకాశం ఉందని ప్రభుత్వం వెల్లడించింది. ఈ ప్రతిపాదనలపై శుక్రవారం సచివాలయంలో ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ (ఎస్ఐపీసీ) సమావేశంలో చర్చించారు. విశాఖపట్నంలో ఇటీవల నిర్వహించిన 'పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్' అనంతరం పలు కంపెనీలు ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు చేసుకున్నాయి. వాటిలో కొన్ని సంస్థలు ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రాథమిక చర్యలు ప్రారంభించాయి. కియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ శ్రీ సత్యసాయి జిల్లాలో రూ.19 వేల కోట్ల పెట్టుబడితో రెండో కార్ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. 330.03 ఎకరాల్లో నిర్మించనున్న ఈ ప్లాంట్ ద్వారా 12 వేల మందికి ఉపాధి లభించనుంది. ప్రస్తుతం పెనుకొండ సమీపంలోని ప్లాంట్‌లో ఏటా 4.30 లక్షల కార్లు తయారవుతున్నాయి. కొత్త ప్లాంట్ అందుబాటులోకి వస్తే మరో 2 లక్షల కార్ల ఉత్పత్తి సామర్థ్యం పెరగనుంది. ఈ ప్రాజెక్టుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించాలని కంపెనీ కోరింది.

శ్రీకాకుళంలో టైటానియం కాంప్లెక్స్

అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ శ్రీకాకుళం జిల్లాలో రూ.13,667 కోట్ల పెట్టుబడితో సమీకృత టైటానియం కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. 2032 నాటికి నిర్మాణం పూర్తి చేస్తామని, ఈ ప్రాజెక్టు ద్వారా 765 మందికి ఉపాధి కల్పిస్తామని సంస్థ తెలిపింది. ఈ కాంప్లెక్స్‌తో రాష్ట్రంలో టైటానియం ఆధారిత పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందుతుందని పేర్కొంది. సెయింట్-గోబైన్ సంస్థ అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో రూ.1,800 కోట్లతో ఫ్లోట్ గ్లాస్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. రోజుకు 12 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మించనున్న ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 500 మందికి ఉపాధి లభించనుంది. 2029 అక్టోబర్ నాటికి నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరింది. ఏటీసీ టైర్స్ సంస్థ అనకాపల్లి జిల్లాలోని తన ప్లాంట్‌ను విస్తరించేందుకు ముందుకొచ్చింది. 97.11 ఎకరాల్లో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు రూ.1,047.47 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. 2029 మార్చి నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విస్తరణ ద్వారా 350 ఉద్యోగాలు కల్పించడంతో పాటు రోజువారీ ఉత్పత్తి సామర్థ్యాన్ని 100 టన్నుల మేర పెంచనుంది.

చిత్తూరులో స్మార్ట్ గార్మెంట్ యూనిట్

ఈస్ట్‌మన్ ఎక్స్‌పోర్ట్స్ గ్లోబల్ క్లోతింగ్ ప్రైవేట్ లిమిటెడ్ చిత్తూరు జిల్లాలోని టెనెబండ గ్రామంలో స్మార్ట్ గార్మెంట్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. మూడు దశల్లో చేపట్టనున్న ఈ ప్రాజెక్టులో మొదటి దశ నిర్మాణాన్ని 2027 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీని ద్వారా 3,103 మందికి ప్రత్యక్షంగా, 1,500 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని సంస్థ అంచనా వేసింది.

బయోగ్యాస్, పవన విద్యుత్ ప్రాజెక్టులు

ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలంలో ఆర్‌వీఏఎస్ రీజెన్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.66.50 కోట్ల పెట్టుబడితో రోజుకు 12 టన్నుల సామర్థ్యం గల కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 600 మందికి ఉపాధి లభించనుంది. జెంటారి రెన్యూవబుల్స్ ఇండియా క్యాప్టర్ వన్ ప్రైవేట్ లిమిటెడ్ నంద్యాల జిల్లా బేతంచెర్లలో రూ.1,722 కోట్ల పెట్టుబడితో 210 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది.

ఏ.కొండూరులో పులి కలకలం!

-మొదటిపేజీ తరువాయి

అధికారులను ఆదేశించారు. ప్రజల ప్రాణాలకు ఎలాంటి ముప్పు కలగకుండా చూడటంతో పాటు పులికి కూడా హాని జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ మేరకు అటవీ శాఖ ఉన్నతాధికారులతో పులి సంచారం, ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, తదుపరి కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు.

పులి కదలికలపై నిరంతర నిఘా

ఏ.కొండూరు పరిసరాల్లో పులి ఎక్కడెక్కడ సంచరిస్తోంది? ఏయే ప్రాంతాల్లో దాని అడుగుజాడలు కనిపించాయి? ఇప్పటివరకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టారు? అనే అంశాలపై పవన్ కల్యాణ్ ఆరా తీశారు. పులి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ దాని సంచార మార్గాలను గుర్తించాలని సూచించారు. పులి ఉన్న ప్రాంతాలపై స్పష్టమైన సమాచారం సేకరించి, సమీప గ్రామాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

ఆధునిక సాంకేతికతతో ఆపరేషన్

పులి ఆచూకీని వేగంగా గుర్తించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని పవన్ కల్యాణ్ సూచించారు. థర్మల్ డ్రోన్లు, ఏఐ ఆధారిత కెమెరా ట్రాప్‌లు, ఇతర ప్రత్యేక పరికరాలను రంగంలోకి దించాలని ఆదేశించారు. పులి సంచార ప్రాంతాలను గుర్తించేందుకు సాంకేతిక నిపుణుల సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు. అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి అనుభవజ్ఞులైన పులి ట్రాకింగ్, రెస్క్యూ బృందాలను రప్పించాలని సూచించారు.

గ్రామాల్లో ముందస్తు అప్రమత్తత

పులి సంచరిస్తున్న అటవీ ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల్లో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ముఖ్యంగా రైతులు, పశువుల కాపరులు, వ్యవసాయ కూలీలకు పులి సంచారంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు ఒంటరిగా అటవీ ప్రాంతాల్లోకి వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు అటవీ శాఖ సిబ్బందితో నిరంతర గస్తీ నిర్వహించాలని పేర్కొన్నారు.

అధికారుల సమన్వయంతో ప్రత్యేక నిఘా

పులి ఆపరేషన్‌ను పీసీసీఎఫ్, చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ స్వయంగా పర్యవేక్షించాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. స్థానిక అటవీ శాఖ బృందాలతో పాటు ప్రత్యేక ట్రాకింగ్ బృందాలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. పోలీస్, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖల అధికారుల సహకారంతో ముందుకు సాగాలని చెప్పారు. పరిస్థితులకు అనుగుణంగా గస్తీని విస్తరించి, పులి కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని ఆదేశించారు.

ప్రజలకు, పులికి హాని జరగకూడదు

పులిని పట్టుకునే క్రమంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. వన్యప్రాణి సంరక్షణ చట్టాలు, నిర్దేశిత నిబంధనలు, రెస్క్యూ ప్రోటోకాల్స్ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనుభవజ్ఞులైన వన్యప్రాణి నిపుణుల పర్యవేక్షణలోనే ఆపరేషన్ నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పిస్తూనే పులి సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలి

పులి సంచారంపై చేపడుతున్న చర్యలను నిరంతరం సమీక్షించాలని, పరిస్థితిలో చోటుచేసుకునే మార్పులను ఉన్నతాధికారులకు వెంటనే తెలియజేయాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. పులిని సురక్షితంగా పట్టుకునే వరకు అప్రమత్తత కొనసాగించాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఏ.కొండూరు పరిసర గ్రామాల్లో అటవీ శాఖ నిఘా, గస్తీ చర్యలు మరింత విస్తరించే అవకాశం ఉంది.

కరవు సీమలో పరిశ్రమల జోరు..

కర్నూలు : ఒకప్పుడు కరవు, వలసలు, ఉపాధి లేమితో సతమతమైన రాయలసీమలో పారిశ్రామిక ప్రగతికి కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. పెట్టుబడులను ఆకర్షిస్తూ స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక రంగం ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో కర్నూలు జిల్లా ఓర్వకల్లులో రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ ఏర్పాటు చేసిన భారీ పానీయాల తయారీ పరిశ్రమ ఉత్పత్తిని ప్రారంభించడం ప్రాధాన్యత సంతరించుకుంది. గతేడాది నవంబర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసిన ఈ పరిశ్రమ కేవలం 12 నెలల్లోనే నిర్మాణం పూర్తి చేసుకుని ఉత్పత్తి దశకు చేరడం విశేషం. ఆసియాలోనే అతిపెద్ద పానీయాల తయారీ ప్లాంట్‌గా పేర్కొంటున్న ఈ పరిశ్రమ రాయలసీమ పారిశ్రామిక చరిత్రలో కీలక ముందడుగుగా నిలవనుంది.

క్యాంపా బ్రాండ్‌కు రాయలసీమ కేంద్రం

దశాబ్దాలుగా భారతీయ వినియోగదారులకు పరిచయమైన క్యాంపా బ్రాండ్ ఇప్పుడు రాయలసీమ నుంచి కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తోంది. ఓర్వకల్లు ప్లాంట్‌లో క్యాంపా కోలా, వివిధ రకాల పండ్ల రసాలు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ తయారు చేయనున్నారు. మొత్తం 10 ఉత్పత్తి లైన్లతో ఏర్పాటైన ఈ కేంద్రం నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు అంతర్జాతీయ మార్కెట్లకు కూడా ఉత్పత్తులను పంపించేందుకు ప్రణాళిక రూపొందించారు.

రూ.1,622 కోట్ల పెట్టుబడితో భారీ ప్లాంట్

ఈ పరిశ్రమ ఏర్పాటుకు రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ సంస్థ సుమారు రూ.1,622 కోట్ల పెట్టుబడి పెట్టింది. ఓర్వకల్లు పారిశ్రామిక ప్రాంతంలో సుమారు 80 ఎకరాల విస్తీర్ణంలో ఈ యూనిట్‌ను అభివృద్ధి చేశారు. ప్రాజెక్టు ద్వారా 1,200 మందికి ప్రత్యక్షంగా, మరో 2,400 మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు గతంలో వెల్లడించారు. ముఖ్యంగా రవాణా, గిడ్డంగులు, వ్యవసాయం, పండ్ల సేకరణ, సరఫరా వ్యవస్థ వంటి అనుబంధ రంగాలకు ఈ పరిశ్రమ ఊతమివ్వనుంది.

యువతకు సొంత జిల్లాలోనే ఉద్యోగాలు

ఈ పరిశ్రమ ప్రారంభంతో రాయలసీమ యువతకు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. నంద్యాలకు చెందిన మహేశ్ హరి, కర్నూలుకు చెందిన ఆర్.కె. స్ఫూర్తి వంటి యువత ఇప్పటికే ఈ పరిశ్రమలో పనిచేస్తున్నారని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఉద్యోగాల కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి మారాలని, పరిశ్రమలే యువత ఉన్న ప్రాంతాలకు రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. స్థానికులకు నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనకు ఈ తరహా పరిశ్రమలు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎక్స్ వేదికగా వీడియో విడుదల చేసిన లోకేశ్

ఓర్వకల్లు ప్లాంట్ ప్రారంభంపై మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. ఆసియాలోనే అతిపెద్ద పానీయాల తయారీ కేంద్రం ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటవడం గర్వకారణమని పేర్కొన్నారు. కేవలం 12 నెలల్లోనే నిర్మాణం నుంచి ఉత్పత్తి దశకు చేరడం రాష్ట్రంలో అమలవుతున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానానికి నిదర్శనమని తెలిపారు. ఏపీపై నమ్మకంతో భారీ పెట్టుబడి పెట్టిన రిలయన్స్ సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రాయలసీమ పారిశ్రామిక ముఖచిత్రంలో మార్పు

ఓర్వకల్లు ప్రాంతం ఇప్పటికే పలు భారీ పరిశ్రమల ఏర్పాటుతో పారిశ్రామిక కేంద్రంగా ఎదిగే అవకాశాలను కలిగి ఉంది. రిలయన్స్ పానీయాల తయారీ కేంద్రంతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్, సెమీకండక్టర్, ఇతర తయారీ రంగాల్లో పెట్టుబడుల ప్రతిపాదనలు కూడా ఈ ప్రాంత అభివృద్ధిపై అంచనాలను పెంచుతున్నాయి. వ్యవసాయ ఉత్పత్తులకు స్థానికంగానే మార్కెట్ లభించడం, రవాణా రంగం విస్తరించడం, చిన్న పరిశ్రమలు ఏర్పడటం వంటి పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.

వలసలకు అడ్డుకట్ట.. ఉపాధికి కొత్త బాట

రాయలసీమలో పరిశ్రమల స్థాపన వేగవంతమైతే ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే యువతకు సొంత జిల్లాల్లోనే ఉపాధి లభించే అవకాశం ఉంటుంది. స్థానిక వనరులను వినియోగించుకుంటూ పరిశ్రమలు అభివృద్ధి చెందితే రైతులు, రవాణా కార్మికులు, చిన్న వ్యాపారులు, సేవారంగాల వారికి కూడా ప్రయోజనం చేకూరుతుంది. ఓర్వకల్లు రిలయన్స్ ప్లాంట్ ఈ దిశగా కీలక ముందడుగుగా నిలుస్తోంది. రానున్న రోజుల్లో మరిన్ని పెట్టుబడులు కార్యరూపం దాల్చితే రాయలసీమ పారిశ్రామికంగా కొత్త గుర్తింపు పొందే అవకాశముంది.

ఘనంగా శ్రీవీరబ్రహ్మంగారి జయంతోత్సవం....





ప్రత్యేక పూజలు జరిపిన రాజ్ కుమార్.....

చిగురుమామిడి నవంబర్ 21 (మీ వార్త విలేకరి సొన్నాయిల భరత్):

కాలజ్ఞానకర్త తత్వవేత్త జగద్గురు శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 418 వ జయంతి కార్యక్రమం చిగురుమామిడి మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద విశ్వబ్రాహ్మణ మండల కమిటీ అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో స్వామివారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి పాటలతో భజనలతో స్వామిని కీర్తించి పుష్పాంజలి ఘటించి టెంకాయ కొట్టి ప్రసాద నివేదన చేశారు

రాజ్ కుమార్ మాట్లాడుతూ 16వ శతాబ్దంలో కీలక నామ సంవత్సర కార్తీక మాస శుద్ధ ద్వాదశి నాడు సరస్వతి నది తీరాన ప్రకృతాంబ పరిపూర్ణయ దంపతులకు వీర బ్రహ్మంగారు జన్మించారు తల్లిదండ్రులు శివైక్యం చెందిన తర్వాత అత్రేయ మహాముని పెంచి విద్యాబుద్ధులు నేర్పించాడు తదుపరి వీరపాపమంబ వీరభోజయచార్యులు దత్తపుత్రునిగా స్వీకరించి అలన పాలన చేశారు చిన్ననాడే తల్లికి విశ్వరూపం చూపించి పిండోత్పత్తి క్రమాన్ని తెలిపారు అచ్చమాంబ వద్ద గోపాలనం చేశారు బ్రహ్మానంద రెడ్డికి కన్నులు ఇచ్చాడు కడప నవాబుకు కాలజ్ఞానాన్ని చెప్పాడు పోలేరమ్మతో నిప్పును తెప్పించాడు గోవింద మాంబను వివాహం చేసుకొని ఐదుగురి పుత్రులను ఒక పుత్రికను కన్నాడు కుల మతాలకు అతీతంగా హరిజన కక్కయ్యను దూదేకుల సిద్దయ్యను శిష్యులుగా చేర్చుకున్నాడు ఆనాడే సంపత్తి భోజనాలు పెట్టించాడు జరుగుతున్నది భవిష్యత్తులో జరగబోయేది తన సాంద్ర సింధు వేదమైన కాలజ్ఞానం ద్వారా అందరికీ తెలియజేశాడు ఇంతటి మహిమాన్వితుడైన వీర బ్రహ్మంగారు చెప్పినట్టే ఈ కలియుగం నడుస్తుంది అన్నారు.

ఈ కార్యక్రమంలో మండల నాయకులు అనుమోజు బాలకృష్ణమాచారి,కూరెల్ల వెంకటయ్య,రంగు రాజేందర్,విశ్వనాథం సత్తయ్య,వడ్లూరి రాజయ్య,శ్రీరామోజు రాములు,పోలోజు లక్ష్మీనారాయణ,పోలోజు కుమారస్వామి, అనుమోజు చిరంజీవి,వడ్లూరి నరేష్,అనుమోజు శ్రీనివాస్,కొత్తపెల్లి శ్రీకాంత్,కొత్తపెల్లి వినోద్, శ్రీరామోజు తిరుపతి కళాకారులు కుతాడి కొమురయ్య,మొగిలి బొందయ్య,నిలిగొండ కిషన్,నిలిగొండ సదానందం,గౌడ భిక్షపతి,మోర వెంకటమల్లు, చందబోయిన పరశు రాములు,మల్లం సూరి,పెనుకుల అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

మండల అధ్యక్షులుగా పదవికే వన్నె తేవాలి...

న్యాయవాది లంకిశెట్టి బాలాజీ

మచిలీపట్నం, నవంబర్ 21 (మీ వార్త ప్రతినిధి)

గూడూరు మండల అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొల్లా రాజేష్ కు మచిలీపట్నం లంకిశెట్టి కార్యాలయంలో శనివారం సన్మానం జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ తన స్వగ్రామం ఆకుమర్రు గ్రామం నుండి గూడూరు మండల అధ్యక్షునిగా బొల్లా రాజేష్ ఎన్నిక కావడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. చిన్న వయసులోనే రాజకీయ అరగ్రేటం చేసి అత్యధిక మెజార్టీతో గెలిచి ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేయడం రాజేష్ నీతి నిజాయితీని తెలియజేస్తుందని బాలాజీ అన్నారు. ఎంతో బాధ్యతగా నీతి నిజాయితీతో గూడూరు మండల అధ్యక్షునిగా రాబోయే ఐదు సంవత్సరాలలో గూడూరు మండలాన్ని ఒక రోల్ మోడల్ మండలంగా అభివృద్ధి పరచాలని బాలాజీ అన్నారు. గూడూరు మండల అధ్యక్షునిగా పనిచేసే అవకాశాన్ని తమ గ్రామానికి కల్పించినందుకు ఎంపీ వల్లభనేని బాలసౌరికి, ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ కు గూడూరు మండల టిడిపి అధ్యక్షుడు గోపి నాగబాబుకు బాలాజీ కృతజ్ఞతలు తెలియజేశారు.



ఈ సందర్భంగా గూడూరు ఎంపీపీ బొల్లా రాజేష్ మాట్లాడుతూ తన పదవీకాలంలో శక్తివంచన లేకుండా పదవికి వన్నె తెచ్చే విధంగా తన విధి నిర్వహణ ఉంటుందని అన్నారు. తనకు సహకరించిన అందరికీ రాజేష్ ధన్యవాదాలు తెలియజేశారు.

టిడిపి మండల అధ్యక్షుడు గోపి నాగబాబు మాట్లాడుతూ తమ గ్రామానికి ఎంపీపీ సీటును కేటాయించడం తమ గ్రామం చేసుకున్న అదృష్టమని అన్నారు. పార్టీ పరంగా బలోపేతం చేస్తూ అభివృద్ధి పదంలో నడిపిస్తామని అన్నారు. ఆకుమర్రు మాజీ విఆర్ఓ లంకిశెట్టి సాయిబాబు మాట్లాడుతూ ఎంతో క్రమశిక్షణతో చిన్నప్పుడు నుండి పరిచయం ఉన్న బొల్లా రాజేష్ ఇప్పుడు గూడూరు మండల అధ్యక్షుడిగా ఎంపిక కావడం నేటి యువతరానికి ఆదర్శప్రాయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలి సుమన్ తదితరులు పాల్గొన్నారు

ఆధారాలు చూపకుంటే తగిన మూల్యం చెల్లించక తప్పదు





ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు పై బొబ్బిలి లక్ష్మణ్ చేసేవి తప్పుడు ఆరోపణలు

ఖండించిన జి మాడుగుల మండలం. వంజరి,గెమ్మెలి, బొయితిలి, పంచాయతీ వైసీపీ నాయకులు

జి మాడుగుల (మీ వార్త ప్రతినిధి) జీకే వీధి మండలంలో ఎంపీపీ పదవి తనకు దక్కలేదని ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు పై బొబ్బిలి లక్ష్మణ్ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవం, కల్పితం అని, ఆధారాలు చూపకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని జి.మాడుగుల మండలం వంజరి, గెమ్మెలి, బొయితిలి, పంచాయతీ వైసీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు .ఎంపీపీ పదవి కోసం ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు ఒక్క రూపాయి కూడా ఎవరి దగ్గరా తీసుకోలేదని, అసలు డబ్బుల విషయం ఎక్కడా ప్రస్తావన రాలేదని స్పష్టం చేశారు. ఎంపీపీ ఎంపిక అనేది పార్టీ అధిష్టానం నిర్ణయం, అలాగే ఎమ్మెల్యే ఒక వ్యక్తికి ప్రపోజ్ చేసినప్పటికి ,ఎంపీటీసీల అభిప్రాయం మేరకే ఎంపీపీ ఎన్నిక జరుగుతుందని, దీనిలో ఎమ్మెల్యే ఒక్కరి పాత్ర ఉండదని తెలిపారు.

పదవి ఆశించి భంగపడిన బొబ్బిలి లక్ష్మణ్, తన అసంతృప్తిని ఎమ్మెల్యే పై నెట్టి రాజకీయంగా బద్నాం చేయాలని చూస్తున్నారని జి మాడుగుల వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు మండిపడ్డారు. ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు నియోజకవర్గంలో నిజాయితీకి, నిబద్ధతకు మారుపేరుగా నిలిచిన నాయకుడని, డబ్బుల కోసం పదవులు అమ్ముకునే సంస్కృతి ఆయన దగ్గర ఎప్పుడూ లేదని గుర్తు చేశారు. తనకు పదవి రాలేదన్న కోపంతో ఇలా తప్పుడు ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదని, బొబ్బిలి లక్ష్మణ్ తన ఆరోపణలకు ఆధారాలు చూపించాలని, లేకపోతే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని జీ మాడుగుల వైసిపి నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. పదవుల కోసం పార్టీని, నాయకుడిని బద్నాం చేసే వారిని ప్రజలు గమనిస్తున్నారని, నిజం ఎప్పుడూ ఎమ్మెల్యే వైపే ఉంటుందని వారు ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వంజరి సీతారాం నాయుడు, మాజీ కోపరేట్ డైరెక్టర్ వంజరి సన్యాసి నాయుడు, మాజీ సర్పంచ్ సీదరి కొండబాబు, వైసీపీ సీనియర్ నాయకులు గెమ్మెలి లక్ష్మీ నాయుడు, వంతల రంగా రావు,అంగనాయిని బాలం నాయుడు, వానగల రాధాకృష్ణ,సోషల్ మీడియా కన్వినర్ సాగిన లక్ష్మణ్, అంగనాయిని రామకృష్ణ, రవి, బొయితిలి ఎంపీటీసీ గావిలి రమణబాబు, మాజీ ఎంపీటీసీ తెరవాడ బ్రహ్మలింగం, బొయితిలి మాజీ సర్పంచ్ తమర్ప రాంబాబు ,మాజీ సర్పంచ్ మల్లన్న, పులిసిమామిడి మాజీ ఎంపీటీసీ తెరవాడ రాము, సూరి మెట్ట పిశా కమిటీ సెక్రటరీ లోంబోరి బాలన్న, వైఎస్ఆర్సిపి విలేజ్ సోషల్ మీడియా సెక్రెటరీ గావెలి నూకరాజు, చెడంగి గణపతి, త్రినాధరాజ్ , వైయస్సార్సీపి నాయకుడు తమరుభ సింహాచలం, వైఎస్ఆర్సిపి యూత్ సెక్రెటరీ విశ్వనాథం, వంశీ , సత్య వెంకట మత్స్యరాజు , తమరుభ అప్పలరాజు, మరియు పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి నూతన ఎంపీపీ దంపతులకు ఘన సన్మానం.

అనంతగిరి,నవంబర్ 21 (మీ వార్త)

అనంతగిరి మండల నూతన ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన సిరగం బిమల రాజకుమార్ దంపతులను శనివారం దైవజనులు డాక్టర్ బి.జె.ఎలీషా రావు ఘనంగా సన్మానించారు.బిబిసి ట్రైబల్ ట్రస్ట్ చైర్మన్ మరియు సి.ఆర్.పి.ఎస్ వైస్ ప్రెసిడెంట్ హోదాలో ఉన్న ఆయన నూతన ఎంపీపీ దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ బి.జె.ఎలీషా రావు మాట్లాడుతూ.గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి నూతన ఎంపీపీ కృషి చేయాలని ఆకాంక్షించారు.అనంతగిరి మండలంలోని మారుమూల గ్రామాల సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.అనంతరం నూతన ఎంపీపీ దంపతులను ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దైవజనులు సిదారి సుబ్లూన్ ఎం సిమోను స్థానిక నాయకులు,ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.







ఆరు నెలల సాధనతో 1539 ఫిడే చెస్ రేటింగ్ సాధించిన ప్రణతి మద్దింశెట్టి

అమలాపురం, మీ వార్త ప్రతినిధి, నవంబర్, 21



?చదరంగం (చెస్) ఆటను ప్రారంభించిన కేవలం ఆరు నెలల వ్యవధిలోనే మద్దింశెట్టి ప్రసాద్ కుమార్తె మద్దింశెట్టి ప్రణతి(1539) అంతర్జాతీయ ఫిడే (ఖీ×ణజు) రేటింగ్ సాధించి అరుదైన ప్రతిభను చాటుకుంది. ఇటీవల కర్నూలులో జరిగిన చెస్ టోర్నమెంట్‌లో అద్భుతమైన ఆటతీరును కనబరిచి ఈ అంతర్జాతీయ రేటింగ్‌ను సొంతం చేసుకుంది. ?అమలాపురంలోని ఐరా ఇంటర్నేషనల్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న ప్రణతి, స్థానిక 'వేద్ చెస్ అకాడమీ' చీఫ్ కోచ్ జి.వి. రమణ వద్ద శిక్షణ పొందుతోంది. చదువుతో పాటు రోజుకు 4 నుండి 6 గంటల పాటు క్రమం తప్పకుండా సాధన చేయడం వల్లే ఇంత తక్కువ సమయంలో ఈ స్థాయికి చేరుకోగలిగింది. ?ఈ సందర్భంగా వేద్ చెస్ అకాడమీ ప్రతినిధులు ప్రణతిని ప్రత్యేకంగా అభినందించారు. పట్టుదల, నిరంతర శ్రమ ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తూ ప్రణతి నేటి విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తోందని కోచ్ జి.వి. రమణ పేర్కొన్నారు.

మున్సిపల్ చైర్మన్ ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే పంతం నానాజీకి ఆహ్వానం



అమలాపురం, మీ వార్త ప్రతినిధి,నవంబర్ 21 అమలాపురం మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్న నల్లా శ్రీధర్ శనివారం కాకినాడలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అమలాపురం మున్సిపల్ చైర్మన్‌గా నిర్వహించనున్న తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావాలని ఎమ్మెల్యే పంతం నానాజీని ఆహ్వానించారు. అనంతరం అమలాపురం పట్టణ అభివృద్ధి, మున్సిపల్ పరిపాలనకు సంబంధించిన పలు అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పట్టణ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా నూతనంగా అమలాపురం మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్న నల్లా శ్రీధర్‌కు పంతం నానాజీ అభినందనలు తెలియజేసి, భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

పంచాయితీ పోరుకు సర్పంచ్ అభ్యర్థులు సై



అరకు వేలి నవంబర్ 21 మీ వార్తా న్యూస్,,, రాష్ట్రంలో తుది మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది.గురువారం రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేశారు. స్థానిక సంస్థ గత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా అరకు వేలి మండల పరిధి పంచాయతీల్లో ఎన్నికల వేడి మొదలైంది.మండలంలోని శిరగం పంచాయతీ లో సర్పంచ్ అభ్యర్థులు నువ్వా నేనా అంటూ సమరానికి సిద్దమవుతున్నారు.పంచాయతి లో 10 మంది సర్పంచ్ పోటీ కు పావులు కదుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.సర్పంచ్ పదవి ఎవరికి దక్కుతుందోనన్న ఉత్కంఠ అటూ అభ్యర్థుల్లో ఇటు పంచాయతీ ప్రజల్లో నెలకొంది.ఎవరికి వారు గట్టి పోటీ ఇస్తున్నారని తెలుస్తోంది.ఇప్పట్నుంచే తమ వ్యూహాలకు పదును పెడుతు రహస్యం గా సమావేశాలు , మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం.అభ్యర్థులు కొందరు నాయకులు కార్యకర్తలు మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటే మరి కొందరు తమ సొంత ఎజెండా ను నమ్ముకొని బరిలోకి దిగుతున్నారు.అలాగే పెద్దల సహకారం ముఖ్యంగా యువతపై ప్రత్యేక దృష్టి పెడుతు మద్దతు కావాలని అభ్యర్థిస్తున్నారు.గెలుపే లక్ష్యంగా చేసుకొని ప్రజల మద్దతును కూడగట్టేందుకు ఇప్పటి నుంచే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. పంచాయతీలో 14 గ్రామాలు ఉన్నాయి,ఏ గ్రామం ఎవరి వైపు మద్దతు ఇస్తుందో సర్పంచ్ పదవి ఎవరికి దక్కుతుందో ఆసక్తికరంగా మారింది.మీకు ఏ సమస్య ఉన్న పరిష్కారం చూపుతామంటు భరోసా ఇస్తున్నారు.సర్పంచ్ పదవి అంటే అలంకరణ కాదు ఒక బాధ్యత కలిగిన ప్రజల సేవకుడుగ మీ సమస్యల్ని పరిష్కరించడానికి ఎప్పుడూ ముందుంటామని చెప్పకనే చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో గ్రామాల్లో మాత్రం వాతావరణం భిన్నంగా ఉంది.ప్రధానంగా సర్పంచ్ పదవులకు పోటీ పడుతున్నవారు ఇప్పటి నుంచే తమ సొంత ఎజెండా ను ముందుకు తెస్తున్నారు.అన్ని సామాజిక వర్గాలను కలుస్తున్నారు.పార్టీలకు అతీతంగా గెలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సర్పంచ్ గా ఎంపిక అయితే అందరితో కలిసి పని చేస్తామని హామీలు ఇస్తున్నారు.ఇవన్నీ జరగాలంటే డిసెంబర్ 2 వరకు ఆగాల్సిందే సర్పంచ్ పదవి ఎవరికి వరిస్తుందో వేచి చూడాలి.

చిలకలపూడి 4 వ సచివాలయం పరిధిలిలో పొతేపల్లి హౌస్ టూ హౌస్ ఫీవర్ సర్వే





మచిలీపట్నం నవంబర్ 21(మీ వార్త ప్రతినిధి) ఈరోజు యు పి హెచ్ సి చిలకలపూడి 4 వ సచివాలయం పరిధిలిలో పొతేపల్లి పంచాయతీ రోడ్ లో హౌస్ టూ హౌస్ ఫీవర్ సర్వే చేయడం మరియు ఐ ఎస్ ఎస్ స్ప్రేయింగ్ అండ్ ఎం ఎల్ డి ఆక్టివిటీస్ అండ్ పి డి పి వర్క్ చేయడం జరిగింది ఇకార్యక్రమంలో. మలేరియా సూపర్ వైజర్ బి .రాఘవేంద్ర రావు హెచ్ ఎస్ బి .సూరిబాబు హెల్త్ అసిస్టెంట్ ఎం బి ఆర్ కోటేశ్వరావు ఏ ఎన్ ఎమ్ రత్న ఆషా వి .పార్వతి, కె .వాణి శానిటేషన్ సెక్రటరీ కృష్ణప్రియ మరియు శానిటేషన్ వర్కర్ నాగరాజు పాల్గొనడం జరిగింది.మరియు ఆయిల్ బాల్స్ వదలడం జరిగింది.

చింతూరులో నూతన ఎరువుల విక్రయ విధానంపై అవగాహన, శిక్షణా కార్యక్రమం





చింతూరు, నవంబర్ 21 మీ వార్త ప్రతినిధి :
రాష్ట్రంలో రైతులకు ఎరువుల పంపిణీని మరింత పారదర్శకంగా, సులభతరంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఎరువుల విక్రయ విధానంపై చింతూరు మండలంలో శుక్రవారం ప్రత్యేక అవగాహన, శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.
జిల్లా వ్యవసాయాధికారి శ్రీ ఎస్.జె.వి. రామమోహనరావు ఆదేశాల మేరకు మండల వ్యవసాయాధికారి శ్రీమతి రత్న ప్రభ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మండలంలోని ఎరువుల వ్యాపారులు, సహకార సంఘాల ప్రతినిధులు, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన ఎరువుల విక్రయ విధానంలో ఎరువుల కొనుగోలు ప్రక్రియ, విధానం అమలు తీరుపై అధికారులు వివరించారు. లియాప్‌లో నమోదు:లి రైతులు ముందుగా తమ స్మార్ట్‌ఫోన్‌లోని ఎరువుల కొనుగోలు యాప్‌లో రైతు నమోదు సంఖ్య లేదా ఆధార్ సంఖ్య ద్వారా ప్రవేశించాలి. అనంతరం రైతుకు సంబంధించిన భూమి వివరాలు తెరపై కనిపిస్తాయి. వాటిని పరిశీలించి అన్ని వివరాలు సక్రమంగా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాత తదుపరి ప్రక్రియను కొనసాగించాలి.లిముందస్తు నమోదు -- సంకేత పత్రం:లి రైతులు తమకు అవసరమైన ఎరువులను, తమకు నచ్చిన మరియు ఎరువులు అందుబాటులో ఉన్న దుకాణం నుంచి ముందుగానే నమోదు చేసుకోవచ్చు. నమోదు పూర్తయిన వెంటనే ప్రత్యేక సంకేత పత్రం (క్యూఆర్ కోడ్) రూపొందుతుంది. లికొనుగోలుకు 48 గంటల గడువు: రూపొందిన సంకేత పత్రం 48 గంటల పాటు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. ఈ గడువులోపు సంబంధిత ఎరువుల దుకాణానికి వెళ్లి సంకేత పత్రాన్ని స్కాన్ చేయించి ఎరువులను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. లిస్మార్ట్‌ఫోన్ లేని రైతులకు ప్రత్యేక సహాయ కేంద్రాలు:లి నూతన విధానంపై రైతులకు పూర్తి అవగాహన కల్పించడంతో పాటు సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ప్రతి ఎరువుల దుకాణం వద్ద, రైతు భరోసా కేంద్రాల్లో ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయాధికారి శ్రీమతి రత్న ప్రభ తెలిపారు. స్మార్ట్‌ఫోన్ లేని రైతులు ఈ సహాయ కేంద్రాలను సంప్రదించి సిబ్బంది సహకారంతో ఎరువులను సులభంగా ముందస్తుగా నమోదు చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.

కొండిబ పంచాయతీలో సర్పంచ్ పోరుకు వేడెక్కిన వాతావరణం.

బరిలో ఆరుగురు అభ్యర్థులు..
గెలుపుపై ఉత్కంఠ.

అనంతగిరి,నవంబర్ 21 (మీ వార్త) మండలంలోని కొండిబ పంచాయతీ సర్పంచ్ పీఠాన్ని దక్కించుకునేందుకు అభ్యర్థులు వ్యూహాలకు పదును పెడుతున్నారు.ఎన్నికల వేడి మొదలవడంతో గ్రామాలన్నీ రాజకీయ సందడితో వేడెక్కాయి.ఈ పంచాయతీ పరిధిలో మొత్తం 24 గ్రామాలు ఉండగా,సర్పంచ్ పదవి కోసం ఆరుగురు అభ్యర్థులు పోటీకి సిద్ధమయ్యారు.నువ్వా నేనా అన్నట్లుగా సాగుతున్న ఈ పోరులో,ఏ గ్రామం ఎవరి వైపు మొగ్గు చూపుతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

గెలుపే లక్ష్యంగా ముమ్మర ప్రయత్నాలు

మంతనాలు, సమావేశాలు:
అభ్యర్థులు ఇప్పటి నుంచే రహస్య సమావేశాలు నిర్వహిస్తూ నాయకులు,కార్యకర్తల మద్దతు కూడగట్టే పనిలో నిమగ్నమయ్యారు.



లి యువత, పెద్దల మద్దతు:
కొందరు పార్టీల అండదండలతో ముందుకు సాగుతుంటే,మరికొందరు సొంత ఎజెండాతో ప్రజల్లోకి వెళ్తున్నారు.ముఖ్యంగా గ్రామ పెద్దల సహకారంతో పాటు యువత ఓట్లను ఆకర్షించేందుకు ప్రత్యేక దృష్టి సారించారు.
హామీల వర్షం:
అన్ని సామాజిక వర్గాలను కలుపుకొని,పార్టీలకు



అతీతంగా విజయం సాధించాలని అభ్యర్థులు భావిస్తున్నారు.తమను గెలిపిస్తే గ్రామాల అభివృద్ధికి అందరితో కలిసి పనిచేస్తామని ఓటర్లకు హామీలు ఇస్తున్నారు.గెలుపు ఎవరిని వరిస్తుందో తెలియాలంటే నవంబర్ 29 వరకు వేచి చూడాల్సిందేనని స్థానికులు చర్చించుకుంటున్నారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవం సందర్భంగా పుస్తక ప్రదర్శన.

విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడమే లక్ష్యం.
ప్రత్తిపాడు నియోజకవర్గం.

యేలేశ్వరం:నవంబర్ 21,(మీ వార్తా ప్రతినిధి)
ఏలేశ్వరంపట్టణంలో ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను (నవంబర్ 14--20) పురస్కరించుకొని గురువారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల సెమినార్ హాలులో మధ్యాహ్నం 12 గంటలకు జరిగిన ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరంలోని ఎస్.కె.ఆర్. మహిళా కళాశాల సంస్కృత అధ్యాపకురాలు డాక్టర్ పి. శ్రీవల్లి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా ముఖ్య అతిథి డాక్టర్ పి. శ్రీవల్లి మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు వివిధ విజ్ఞాన, సాహిత్య, చారిత్రక గ్రంథాలను చదివే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు. పుస్తక పఠనం ద్వారా జ్ఞానం, ఆలోచనా శక్తి, వ్యక్తిత్వ వికాసం పెరుగుతాయని వివరించారు.
కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సునీత విద్యార్థులను



ఉద్దేశించి మాట్లాడుతూ, గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో పుస్తక పఠనం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, పుస్తక పఠనం విద్యార్థుల్లో క్రమశిక్షణ, విజ్ఞానం, సృజనాత్మకతను పెంపొందిస్తుందని తెలిపారు. గ్రంథాలయ ఇన్‌ఛార్జి శ్రీ వి. రామారావు మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల ప్రాముఖ్యతను వివరించి, విద్యార్థులు వివిధ అంశాలకు సంబంధించిన పుస్తకాలను చదవాలని సూచించారు. ఈ వారోత్సవాల్లో భాగంగా కళాశాల ప్రాంగణంలో గ్రంథాలయం ఆధ్వర్యంలో ప్రత్యేక పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. వివిధ అంశాలకు సంబంధించిన పుస్తకాలను ప్రదర్శనలో ఉంచారు. విద్యార్థులు ఆసక్తిగా పుస్తక ప్రదర్శనను సందర్శించి పుస్తకాల వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు గ్రంథాలయ వినియోగంపై అవగాహన కల్పించారు. కళాశాల గ్రంథాలయ కమిటీ సభ్యులు, అధ్యాపకులు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉర్లగూడెం సర్పంచ్‌గా నందిపా మహేశ్వరి ఏకగ్రీవ ఎన్నిక

టీడీపీ ఖాతాలో తొలి ఏకగ్రీవ సర్పంచ్ స్థానం

చింతలపూడి, నవంబర్ 21 (మీ వార్త ప్రతినిధి):
మండల పరిధిలోని ఉర్లగూడెం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా నందిపాము మహేశ్వరి, ఉప సర్పంచ్‌గా కొండుబోయిన యువరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన నందిపాము మహేశ్వరి, కొండుబోయిన యువరాజులను చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చింతం విష్ణుమూర్తి, మండల జనసేన అధ్యక్షులు చీదరాల మధుబాబు తదితర నాయకులు పాల్గొని ఏకగ్రీవంగా ఎన్నికైన వారికి అభినందనలు తెలిపారు.



వంగవీటి రాధకృష్ణ నీ మర్యాదపూర్వకంగా కలిసిన: నల్లా చిన్న



అమలాపురం, మీ వార్త ప్రతినిధి, నవంబర్, 21 నవంబర్ 23 న రంగా గారి అబ్బాయి విజయవాడ నగర మేయర్ గా ప్రమాణస్వీకారం చేస్తున్న వంగవీటి రాధాకృష్ణ ని కలిసిన అమలాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు నల్లా సుబ్బారావు(చిన్నా)

అభివృద్ధిని చూసి కూటమి అభ్యర్థులను గెలిపించండి ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



జీలుగుమిల్లి. (మీ వార్త ప్రతినిధి) జీలుగుమిల్లి కూటమి గ్రామ సర్పంచ్ అభ్యర్థి చిర్రి వెంకటేశ్వరరావు ను ప్రజలు మద్దతు తెలిపి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కోరారు. శనివారం జీలుగుమిల్లిలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు సుంకవల్లి సాయి వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిర్రి వెంకటేశ్వరరావు సర్పంచ్‌గా ఎన్నికైతే గ్రామ అభివృద్ధికి కృషి చేస్తారని తెలిపారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. . కూటమి ప్రభుత్వంలో అభివృద్ధిని చూసి సర్పంచ్ అభ్యర్థులను వార్డు మెంబర్లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు .నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రతి కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే కూటమి పార్టీలను దిక్కరించి ఎవరైనా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బాలరాజు తెలిపారు. తెలుగుదేశం పార్టీ మాజీ సర్పంచ్ వనమా రాంబాబును జనసేన గ్రామ పార్టీ అధ్యక్షుడు రాయి సుబ్బారావు లను పార్టీ కార్యక్రమాలను వ్యతిరేకించినందుకు ఇరు పార్టీల నుండి సస్పెండ్ చేసినట్లు ఎమ్మెల్యే బాలరాజు మండల పార్టీ అధ్యక్షుడు సుంకవల్లి సాయి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సుంకవల్లి సాయి, ఏఎంసీ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం. బండారు అనిల్. కె రమేష్. గారపాటి శ్రీను, బోల గాని అఖిల్. ఉండవల్లి కిరణ్. రూప సత్యనారాయణ. కూరం వెంకటేశ్వరరావు, నెలటూరు మోహన్, ముంగ మురుగు ప్రభాకర్ .తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు..

నేడు నారికేడాల వారి పాలెం సర్పంచ్ స్థానానికి మహాకూటమి బలపరిచిన అభ్యర్థిగా నామినేషన్ వేసిన బొర్రా శ్రీనివాసరావు



గూడూరు నవంబర్ 21(మీ వార్త ప్రతినిధి) గూడూరు మండలం ఆకులమన్నాడు స్వర్ణ సచివాలయం లో గూడూరు మండలంలోని నారికేడాల వారి పాలెం గ్రామ సర్పంచ్ స్థానానికి పెడన శాసన సభ్యులు కాగిత కృష్ణా ప్రసాద్, ఎంపీ వల్లభనేని బాల సౌరీ సూచించిన మహా కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న బొర్రా శ్రీనివాసరావు నామినేషన్ కార్యక్రమంకు పెద్ద సంఖ్యలో అభిమానులు, కూటమి కార్యకర్తలు, కనపర్తి దుర్గా వెంకట రామాంజనేయులు టిడిపి సీనియర్ నాయకులు ఆలపాటి గోపాలకృష్ణమూర్తి టీడీపీ సీనియర్ నాయకులు, బాకీ నాని ఎంపీటీసీ గ్రామ ప్రజలు గ్రామ పార్టీ టిడిపి అధ్యక్షులు కార్యదర్శులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైలు పేట యు పి హెచ్ సి పరిధి లో ఫీవర్ సర్వే



మచిలీపట్నం నవంబర్ 21(మీ వార్త ప్రతినిధి) మచిలీపట్నం రైలుపేట యూ.పి.హెచ్.సి పరిధిలో వున్నా సుకరలాబాద్ 10 వా సచివాలయం ఏరియాలో ఫివర్ సర్వే చేసి హౌస్ టూ హౌస్ ఐ ఎస్ ఎస్‌అండ్ యాంటీ లార్వ పి డి పి వర్క్ చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్స్ బి.రాఘవేంద్ర రావు, బి.సూరిబాబు హెల్త్ అసిస్టెంట్ యం.చంద్ర మెహన్ ఏ.యన్.యం సునీత మరియు ఆశా కార్యకర్తలు, శానిటేషన్ మేస్త్రి శేషుబాబు పాల్గొన్నారు.

మండల వ్యాప్తంగా ప్రశాంతంగా మొదటి రోజు పంచాయితీ నామినేషన్లు



రౌతులపూడి నవంబర్ 21:(మీ వార్త న్యూస్ ప్రతినిధి) రౌతులపూడి మండల వ్యాప్తంగా నవంబర్ 21వ తేదీ నుండి ప్రారంభమైన గ్రామపంచాయతీ సర్పంచ్ లు మరియు వార్డు మెంబర్ల నామినేషన్లు ప్రశాంతంగా జరిగాయి. మండల వ్యాప్తంగా సర్పంచ్ పదవికి 34 మంది అభ్యర్థులు నామినేషన్లు వేసారు.135 వార్డ్ మెంబర్లకు నామినేషన్లు వేసినట్లు అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు తగిన భద్రత ఏర్పాట్లు చేశారు.

లింగపాలెం ఎంపీపీగా చందమాల సుగుణకుమారి ఏకగ్రీవ ఎన్నిక..

లింగపాలెం,

ఏలూరు జిల్లా లింగపాలెం మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలిగా బోగోలు గ్రామానికి చెందిన (ఎంపీపీ) చందమాల సుగుణకుమారి గారు మరియు (సల్మాన్ రాజ్) సతీమణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఈ ఎన్నిక ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.
ఎంపీపీ పదవికి చందమాల సుగుణకుమారి పేరును సభ్యులు ప్రతిపాదించగా, మరెవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఆమె ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి జె. లింగయ్య అధికారికంగా ప్రకటించారు. అనంతరం నూతన ఎంపీపీగా ఎన్నికైన సుగుణకుమారి చేత ప్రమాణ స్వీకారం చేయించి, నియామక పత్రాన్ని అందజేశారు.

అభినందనల వెల్లువ:

ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన చందమాల సుగుణకుమారికి పలువురు ప్రజాప్రతినిధులు, మండల స్థాయి నాయకులు, ఎంపీటీసీ సభ్యులు మరియు అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మండల అభివృద్ధే లక్ష్యం:

ఈ సందర్భంగా నూతన ఎంపీపీ సుగుణకుమారి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన నాయకులకు, నాయకురాలు తోటి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల సమగ్ర అభివృద్ధికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడానికి, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సహకారంతో మండలంలో అభివృద్ధి పరంగా శాయశక్తుల కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.



పాయకరావుపేట వైసిపి సర్పంచ్ అభ్యర్థి కాదా రామకృష్ణ గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలి



పాయకరావుపేట, మీ వార్త ప్రతినిధి,నవంబర్ 21 :
పాయకరావుపేటలో వైసీపీ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు ముఖ్య నాయకులు పాల్గొని ఎన్నికల కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు ధనిశెట్టి బాబూరావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, ఎంపీటీసీ జగతా శ్రీను, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పెదపాటి అమ్మాజీ, మాజి జెడ్పీటీసీ లంక సూర్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి సత్య మహేష్,, తదితరులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో ఎదురవుతున్న సమస్యలు, వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పాయకరావుపేట పట్టణం మరింత అభివృద్ధి చెందాలంటే ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం అవసరమని, ఆ దిశగా కాదా రామకృష్ణను సర్పంచ్ గా గెలిపించుకోవడం కీలకమని పేర్కొన్నారు. స్థానిక సామాజిక సమీకరణాలను ప్రస్తావిస్తూ, శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన సుమారు రెండు వేల ఓటర్ల మద్దతుతో పాటు అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ముందుకు సాగాలని అన్నారు. రాజకీయ అనుభవం, నాయకత్వ లక్షణాలు, ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం ఉన్న రామకృష్ణకు పార్టీ శ్రేణులంతా అండగా నిలవాలని కోరారు.
అనంతరం వైసీపీ సర్పంచ్ అభ్యర్థి కాదా రామకృష్ణ మాట్లాడుతూ పాయకరావుపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నదే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు.



పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనకు ఒక అవకాశం కల్పించి ఆశీర్వదించాలని పట్టణ ప్రజలను కోరారు.ఈ సమావేశంలో అనకాపల్లి జిల్లా వై ఎస్సార్సిపి కార్యదర్శి నెలపర్తినాగరాజు, ఎంపీటీసీ మేరపురెడ్డి రాజేష్, కొమ్మన వెంకటేశ్వరరావు, పిరాధి రాజు, పోసిన వీరబాబు, వేమగిరి లక్ష్మణరావు, నెలపర్త అర్జునరావు, జొన్నకూటి సూరిబాబుతో పాటు పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి - అభివృద్ధిని సాధించండి

ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు

పెంటపాడు నవంబర్ 21 (మీ వార్త ప్రతినిధి)
తాడేపల్లిగూడెం నియోజకవర్గం ప్రత్తిపాడు గ్రామంలో కొణిదెల నాగబాబు, ఎమ్మెల్సీ, ఏపీ గ్రీన్ ఆంధ్ర సొసైటీ చైర్మన్ మరియు తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ సమావేశంలో పాల్గొన్నారు.
తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ మరియు కౌన్సిలర్ అభ్యర్థులతో సమావేశమై ఎన్నికల కార్యాచరణ, ప్రచార ప్రణాళికలు, కూటమి అభ్యర్థుల విజయానికి చేపట్టాల్సిన సమన్వయంపై చర్చించారు. అదేవిధంగా ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల మద్దతుతో ఎంపీటీసీ, జడ్పీటీసీ మరియు ఎంపీపీలుగా ఎన్నికైన ప్రజాప్రతినిధులతో ఆత్మీయంగా సమావేశమై వారికి అభినందనలు తెలియజేశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు.
ఈ సందర్భంగా కొణిదెల నాగబాబును ఉద్దేశించి జనసేన పార్టీకి బాహుబలి వంటి నాయకుడిగా అభివర్ణిస్తూ, నాగబాబు పట్ల తనకున్న ప్రత్యేక అభిమానం, గౌరవాన్ని బొలిశెట్టి శ్రీనివాస్ వ్యక్తం చేశారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, నాయకత్వం పట్ల తనకున్న నిబద్ధతను చాటుతూ పార్టీ బలోపేతానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని పేర్కొన్నారు. కూటమి ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సమష్టి కృషితో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని నాయకులు, అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ ఎన్నికల అభ్యర్థులు, పార్టీ ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో 24, 25, 26, 32 వార్డుల్లో కూటమి ఎన్నికల ప్రచారం





తాడేపల్లిగూడెం, నవంబర్ 21 (మీ వార్త ప్రతినిధి)
తాడేపల్లిగూడెం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 24, 25, 26, 32 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులతో కలిసి తాడేపల్లిగూడెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి, భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి), పట్టణ అధ్యక్షులు పట్నాల రాంపండు, తాడేపల్లిగూడెం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి పాలూరి వెంకటేశ్వరరావు కుమారుడు పాలూరి సందీప్ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి పాలూరి వెంకటేశ్వరరావుతో పాటు వార్డు కౌన్సిలర్ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. తాడేపల్లిగూడెం పట్టణ సమగ్ర అభివృద్ధికి కూటమి అభ్యర్థులను గెలిపించడం అవసరమని, ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బందవీధిలో అయ్యప్ప స్వామి సన్నిధాన పూజ



జి మాడుగుల (మీ వార్త ప్రతినిధి) అల్లూరి సీతారామరాజు జిల్లా జి మాడుగుల మండలం బంధ వీధి గ్రామంలో ఈనెల 23 సోమవారం నాడు అయ్యప్ప స్వామి సన్నిధాన పడి పూజ భారీ స్థాయిలో నిర్వహించడానికి బారి ఏర్పాట్లు జరుగుతున్నాయి . బంద్ వీధి గ్రామానికి చెందిన ధలాయి రాజు, రవణమ్మ ,దంపతుల కుమారులు శివ గణేష్ కుమార్, పవన్ కళ్యాణ్, స్వామి మాల వేయడంతో బంధు వీధి గ్రామంలో భారీగా పడిపూజ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పూజ కార్యక్రమానికి జిమాడుగుల, పాడేరు, పెదబయలు, హుకుంపేట, చింతపల్లి, జికే వీధి , మండలాలకు చెందిన అయ్యప్ప స్వామి మాలాదారులు భక్తులు రానున్నారనీ. పూజ నిర్వాహకులు ఆయా మండలాల్లోని అయ్యప్ప మాల ధరించిన వారి పీఠాలకు వెళ్లి ప్రత్యేకంగా ఆహ్వానం పలికామని. సోమవారం జరిగే స్వామి వారి పూజకు ప్రతి ఒక్కరూ హాజరయ్యి స్వామివారి ఆశీస్సులు అందుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు..

బాంబుల పేలుళ్లతో మత్స్యకారుల ఇళ్లకు నష్టం

డీఎల్‌పురంలో పగిలిన ఇంటి పెంకులు.. గోడలకు బీటలు





నక్కపల్లి, నవంబరు 21: డీఎల్‌పురం గ్రామంలో ఎంఎంఎస్ కంపెనీ పరిధిలో ఈరోజు బాంబులు పేల్చడంతో సమీపంలో నివసిస్తున్న మత్స్యకారుల ఇళ్లకు నష్టం వాటిల్లింది. పేలుళ్ల ధాటికి ఇళ్ల పైకప్పులపై ఉన్న పెంకులు పగిలిపోగా, కొన్ని ఇళ్ల గోడలకు బీటలు ఏర్పడ్డాయి. దీంతో స్థానిక మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు గింజల లక్ష్మణరావు, గింజల శ్రీనివాసరావు, సింహాద్రి, అయినంపూడి రామకృష్ణంరాజు, వేగేశిన రవికుమార్ రాజు, ట్రాక్టర్ శీను, గింజల తాతారావు తదితరులు గ్రామానికి చేరుకుని నష్టపోయిన ఇళ్లను పరిశీలించారు. బాధిత కుటుంబాలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాంబుల పేలుళ్ల కారణంగా ఇళ్లకు నష్టం వాటిల్లిన నేపథ్యంలో బాధితులకు న్యాయం చేయాలని, జరిగిన నష్టాన్ని అంచనా వేసి తగిన పరిహారం అందించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

భారీ ఊరేగింపుతో, లింగంపర్తి కూటమి సర్పంచ్ గా అభ్యర్థి వరుపుల దుర్గవేణి నామినేషన్.

పత్తిపాడు నియోజకవర్గం.





ఏలేశ్వరం: నవంబర్ 21(మీ వార్తా ప్రతినిధి) ఏలేశ్వరం మండలం, లింగంపర్తి గ్రామంలో, స్థానిక సర్పంచ్ అభ్యర్థిగా కూటమి బలపరిచిన, వరుపుల తమ్మయ్య బాబు సతీమణి శ్రీమతి వరుపుల దుర్గ వేణి, జనసేన నాయకులు, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, వైస్ ఎంపీపీ పెంటకోట గంగాభవాని శ్రీధర్, తదితరులు వెంట రాగా, భారీ ఊరేగింపుతో, తన స్వగృహం నుండి, పంచాయతీ ఆఫీసు నకు వచ్చి లింగంపర్తి సర్పంచ్ గా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా వరుపుల తమ్మయ్య బాబు అభిమానులు , ఊరంతా భారీగా బాణాసంచా కాల్చి సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో జ్యోతుల పెదబాబు, పెంటకోట శ్రీధర్, వరుపుల సూరిబాబు తదితర కూటమి నాయకులతోపాటు, కార్యకర్తలు, అభిమానులు, జనసేన వీర మహిళలు భారీగా పాల్గొన్నారు.

మర్రివీడు గ్రామ పంచాయతీ కూటమిపార్టీ సర్పంచ్ అభ్యర్థిగా: ఒలపల్లి శ్రీకాంత్ నామినేషన్ దాఖలు.

ప్రత్తిపాడు నియోజకవర్గం.ఏలేశ్వరం



: **నవంబర్ 21(మీ వార్త ప్రతినిధి)** ఏలేశ్వరం మండలం , మర్రివీడు గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా ఒలపల్లి శ్రీకాంత్ నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా జే. అన్నవరం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. తూర్పు లక్ష్మీపురం, జే. అన్నవరం, మర్రివీడు గ్రామ పంచాయతీలకు సంబంధించి జే. అన్నవరం పంచాయతీ కార్యాలయంలో నామినేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నామినేషన్ల ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోంది. ఎన్నికల నేపథ్యంలో అధికారులు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి భద్రతా చర్యలు చేపట్టారు.

కె.జగన్నాధపురం కూటమి సర్పంచ్ అభ్యర్థిగా గంగుమళ్ల శ్రీనివాస్

శుక్రవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు

సర్పంచ్ అభ్యర్థితో పాటు 10 వార్డులకు 10 మంది వార్డు సభ్యుల నామినేషన్లు





అమలాపురం, మీ వార్త ప్రతినిధి,నవంబర్ 21
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం కె.జగన్నాధపురం గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా గంగుమళ్ల శ్రీనివాస్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయనతో పాటు గ్రామ పంచాయతీలోని 10 వార్డులకు కూటమి తరఫున 10 మంది వార్డు సభ్యుల అభ్యర్థులు కూడా తమ నామినేషన్లను దాఖలు చేశారు. ఈ సందర్భంగా గంగుమళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆశీస్సులు, కూటమి నాయకులు, కార్యకర్తల సహకారంతో సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలుస్తున్నట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని పేర్కొన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ తాగునీరు, పారిశుధ్యం, అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.
ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయడంతో పాటు గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని సమగ్ర అభివృద్ధి సాధించడమే తన ధ్యేయమని అన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తానని తెలిపారు. కూటమి ప్రభుత్వ సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని, గ్రామ ప్రజలు తమకు మద్దతుగా నిలిచి ఆశీర్వదించాలని గంగుమళ్ల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. కె.జగన్నాధపురం గ్రామంలో సర్పంచ్ అభ్యర్థితో పాటు మొత్తం 10 వార్డులకు 10 మంది వార్డు సభ్యుల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడంతో కూటమి శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. గ్రామ అభివృద్ధి లక్ష్యంగా సమష్టిగా ముందుకు సాగుతామని కూటమి నాయకులు, కార్యకర్తలు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

- ఏలూరు నగర మేయర్ గా భారీ మెజారిటీ తో గెలుపొందిన రెడ్డి అప్పలనాయుడు కి ఘన విజయం..

ఏలూరు అర్బన్ జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు నంగులూరి సత్యనారాయణ అధ్యక్షతన

శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి సత్రం నందు అభినందన సభ..

జిల్లా టిడిపి అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యేబడేటి రాధాకృష్ణ (చంటి) కలిసి ముఖ్య అతిథులుగా హాజరైన మేయర్ రెడ్డి అప్పలనాయుడు కార్పోరేటర్లు తవ్వా వెంకట అరుణ కుమారి చలువాది రూప కళాశ్రీ



ఏలూరు, నవంబర్ 21:- ఏలూరు నగరపాలక సంస్థ మేయర్‌గా అత్యధిక మెజారిటీ తో విజయం సాధించిన రెడ్డి అప్పలనాయుడుకు, రెడ్డి అప్పలనాయుడుఅఖండ విజయానికి సహకరించిన జిల్లా టిడిపి అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే శ్రీ బడేటి రాధాకృష్ణ (చంటి)ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఘనంగా అభినందన సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక అగ్రహారం లోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ సత్రం (పచ్చిపులుసు వారి కళ్యాణమండపం) లో నిర్వహించిన ఈ అభినందన సభ కార్యక్రమానికి ఏలూరు జిల్లా టిడిపి అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ (చంటి) ఏలూరు నగర మేయర్ శ్రీ రెడ్డి అప్పలనాయుడు కార్పోరేటర్లు తవ్వా అరుణ కుమారి , చలువాది రూపకళాశ్రీ మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి శివరామకృష్ణ ప్రసాద్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు..
ఈ సందర్భంగా ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘస్తులు, మహిళలు ఎమ్మెల్యే బడేటి చంటి నగర మేయర్ రెడ్డి అప్పలనాయుడు కార్పోరేటర్లు తవ్వా అరుణ కుమారి గారికి, చలువాది రూపకళాశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి శివరామకృష్ణ ప్రసాద్ లకు పూలమాలలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తొలుత కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అనంతరం ఏలూరు అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నంగులూరి సత్యనారాయణ అధ్యక్షతన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ వారి కళ్యాణ మండపం (పచ్చిపులుసు వారి కళ్యాణమండపం) నందు నిర్వహించిన అభినందన సభలో ఆర్యవైశ్య సంఘస్తులు, కుల పెద్దలు బడేటి చంటి, రెడ్డి అప్పలనాయుడు తవ్వా అరుణ కుమారి చలువాది రూప కళాశ్రీ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ.. ఒక సాధారణ హమాలీ కార్మికుడిగా జీవితాన్ని ప్రారంభించి, ఎన్నో ఒడిదుడుకులు, కష్టనష్టాలను ఎదుర్కొని ఈ స్థాయికి చేరుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జీవిత ప్రయాణంలో ఆర్థిక ఇబ్బందులు, కేసులు, అనేక సవాళ్లు ఎదురైనప్పటికీ తాను నమ్ముకున్న కార్మిక వర్గం ఎల్లప్పుడూ తనకు అండగా నిలిచిందని భావోద్వేగంగా పేర్కొన్నారు. కార్మికుల కష్టాలు, వారి జీవన పరిస్థితులు తనకు బాగా తెలుసని, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. హమాలీ కార్మికులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ అండగా నిలుస్తానని స్పష్టం చేశారు. తన రాజకీయ ప్రస్థానంలో కార్మిక వర్గం అందించిన ఆదరాభిమానాలు, సహకారం మరువలేనివని ఆయన తెలిపారు. అలాగే ఏలూరులో తనను భారీ మెజారిటీ తో గెలిపించి, తన విజయానికి సహకరించిన ఆర్యవైశ్య సంఘస్తులకు రెడ్డి అప్పలనాయుడు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.. ఏలూరు జిల్లా సమగ్రాభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల ప్రగతి, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.. తనపై నమ్మకం ఉంచి ఏలూరు నగర మేయర్ గా కీలక బాధ్యతలు అప్పగించిన గౌరవ ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ గారికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారికి, మరియు ఎన్డీఏ కూటమి పెద్దలకు ఆయన



హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.. తనకు లభించిన ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ ఏలూరు నగర అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని రెడ్డి అప్పలనాయుడు పేర్కొన్నారు..
ఏలూరులో మౌలిక వసతుల కల్పనా ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తానని రెడ్డి అప్పలనాయుడు తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఏలూరు ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు చల్లా రాజారావు గౌరవ అధ్యక్షులు చలువాది శివకృష్ణ బ్రహ్మయ్య ప్రధాన కార్యదర్శి నున్న శ్రీనివాస్ కోశాధికారి కనిగొళ్ళ రాజేష్ వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దుల పవన్ కుమార్ఆర్యవైశ్య సంఘం నాయకులు, జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తాపలువురు ఏలూరు అర్బన్ ఆర్యవైశ్య సంఘం కుల పెద్దలు, మహిళలు, రెడ్డి అప్పలనాయుడు అభిమానులు, పలువురు కూటమి పార్టీలకు చెందిన నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

43వ వార్డులో పడాల శ్రీనివాస్ ప్రచారం ముమ్మరం!



తాడేపల్లిగూడెం, నవంబర్ 21 (మీ వార్త ప్రతినిధి) తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ 43వ వార్డు స్వతంత్ర అభ్యర్థి పడాల శ్రీనివాస్ తన ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. శనివారం 43వ వార్డు లోని ఎఫ్‌సీఐ కాలనీలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, వార్డు అభివృద్ధికి పాటుపడతానని ఓటర్లకు హామీ ఇచ్చారు. తనకు ఏ పదవి లేకపోయినా గత ఎన్నో ఏళ్ళుగా వార్డు ప్రజలకు సేవలు అందించిన విషయాన్ని ఆయన గుర్తు చేస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా తన సేవలను కొనసాగిస్తానని చెప్పారు. తన ఎన్నికల గుర్తు కప్పు సాసరుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కాలనీ ప్రజలు ఆయనకు స్వాగతం పలుకుతూ తమ ఆదరాభిమానాలను వ్యక్తం చేస్తున్నారు. పడాల శ్రీనివాస్ కు తమ మద్దతు ఉంటుందని, ఆయనకు ఓటు వేసి గెలిపిస్తామని , తమ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఆయనకు ఉంటాయని భరోసా ఇస్తున్నారు. ఈ ప్రచారంలో స్థానిక పెద్దలు, యువకులు స్వచ్ఛందంగా పాల్గొని శ్రీనివాస్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. పలువురు ప్రజలు స్వయంగా ప్రచారంలో ఆయనతో అడుగులు కలపడం విశేషం.

జొన్నగిరి సర్పంచ్ అభ్యర్థిగా మొగిలి భారతి రెడ్డి నామినేషన్ దాఖలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికల బరిలోకి..



తుగ్గలి, నవంబర్ 21 (మీ వార్త): తుగ్గలి మండల పరిధిలోని జొన్నగిరి గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల సందడి ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున సర్పంచ్ అభ్యర్థిగా మొగిలి బ్రహ్మానంద రెడ్డి సతీమణి మొగిలి భారతి రెడ్డి శనివారం ఎన్నికల అధికారులను కలిసి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె నామినేషన్ దాఖలు కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని మద్దతు తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు భారతి రెడ్డి నామినేషన్ వేయడంతో జొన్నగిరి గ్రామంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈ కార్యక్రమంలో మొగిలి బ్రహ్మానంద రెడ్డి, ఎర్ర నాగప్ప, గుంత రఘు, తలారి పక్కిరప్ప, దివాకర్, శేఖర్ రెడ్డి, నెట్టికంఠయ్య, పసుల అనుమన్న, తెరప్ప, సుంకప్ప తదితరులు పాల్గొన్నారు.ం

జి. ఎర్రగుడి సర్పంచ్ బరిలో జిట్టా నగేష్ యాదవ్.. వైఎస్సార్సీపీ తరఫున నామినేషన్ దాఖలు



తుగ్గలి, నవంబర్ 21 (మీ వార్త):తుగ్గలి మండల పరిధిలోని జి. ఎర్రగుడి గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా జిట్టా నగేష్ యాదవ్ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి జొన్నగిరి గ్రామంలోని స్వర్ణ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. అనంతరం ఎన్నికల అధికారులను కలిసి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. సర్పంచ్ అభ్యర్థిగా జిట్టా నగేష్ యాదవ్ నామినేషన్ దాఖలు చేయడంతో జి. ఎర్రగుడి గ్రామంలో రాజకీయ సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఆయనకు మద్దతుగా పలువురు నాయకులు, కార్యకర్తలు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఈశ్వర్ రెడ్డి తనయుడు, సీపీఎం నాయకులు జి ఎర్రగుడి భాస్కర్ రెడ్డి, జి. ఎర్రగుడి మాజీ సర్పంచ్ రామచంద్ర రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. నామినేషన్ కార్యక్రమం పార్టీ శ్రేణుల సమక్షంలో ఉత్సాహంగా సాగింది.



‘జనవరి 12 విడుదల’ నుంచి ఫస్ట్ సింగిల్ ‘దివికి దివికి’ విడుదల!

అగ్ర కథానాయకులు విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో డైరెక్టర్ అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న తాజా చిత్రం ‘జనవరి 12 విడుదల’. సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ చిత్రం విడుదల కాబోతుండగా.. ఈ సినిమా ప్రమోషన్లను చిత్రబృందం ఘనంగా ప్రారంభించింది. ఇందులో భాగంగా సినిమాలోని తొలి పాట ‘దివికి దివికి’ సంబంధించిన సాంగ్ ప్రోమోను తాజాగా విడుదల చేసింది. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి స్వరాలు సమకూరుస్తుండగా.. మధుప్రియ, హరిప్రియ కలిసి పాడారు. అనంత్ శ్రీరామ్ లిరిక్స్ అందించాడు. వెంకటేష్, కళ్యాణ్ రామ్ కలిసి నటిస్తున్న తొలి చిత్రం కావడంతో ‘జనవరి 12 విడుదల’పై ఆరంభం నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరిద్దరి సరసన కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు.

బెల్లంకొండ ‘హైందవ’ విడుదలకు బ్రేక్.. త్వరలోనే కొత్త రిలీజ్ డేట్ ప్రకటిస్తామన్న మేకర్స్!



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, సంయుక్త జంటగా లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రం ‘హైందవ’ విడుదల వాయిదా పడింది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ మూన్‌షైన్ పిక్చర్స్ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ సినిమా ఈ ఏడాది నవంబర్ 27న థియేటర్లలో విడుదల కావాల్సి ఉంది. అయితే అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ప్రేక్షకులకు ఒక మంచి సినిమాటిక్ అనుభూతిని అందించాలనే ఉద్దేశంతోనే విడుదల తేదీని వాయిదా వేస్తున్నట్లు నిర్మాతలు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని పేర్కొంటూ, ప్రేక్షకుల సహనానికి, నిరంతర మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు. గత నెలలో విడుదలైన ఈ సినిమా టీజర్‌కు సినీ ప్రియుల నుంచి విశేష స్పందన లభించింది. రంగాపురం అనే గ్రామ నేపథ్యంలో సాగే ఈ మిస్టరీ థ్రిల్లర్ కథాంశం ఆసక్తిని రేకెత్తిస్తోంది. గ్రామంలోని ఒక పురాతన ఆలయంలోని విగ్రహాలన్నీ మాయమవడం, అదే సమయంలో ఒక గ్రామస్థుడు హత్యకు గురికావడంతో కథ మలుపు తిరుగుతుంది. అయితే నిర్ణీత గడువులోగా ఆ విగ్రహాలన్నీ తిరిగి వస్తాయని ఆలయ పూజారి విశ్వసిస్తుంటారు. ఈ వింత కేసును దర్యాప్తు చేసేందుకు దేవుడి కంటే మానవత్వాన్ని నమ్మే ఒక నాస్తికుడైన పోలీసు అధికారి రంగంలోకి దిగడంతో నమ్మకానికి, హేతువాదానికి మధ్య జరిగే ఆసక్తికరమైన సంఘర్షణతో ఈ చిత్రం సాగనుంది. మహేష్ చందు నిర్మిస్తున్న ఈ చిత్రంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నాస్తిక పోలీసు అధికారిగా నటిస్తుండగా, సంయుక్త కథానాయికగా కనిపించనుంది. ఆలయ పూజారి పాత్రలో మహేష్ మంజ్రేకర్ కీలక పాత్ర పోషిస్తుండగా, సౌరభ్ సచ్‌దేవా, జేడీ చక్రవర్తి, శివాజీ రాజా, గెటప్ శ్రీను తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ ఆకట్ట థ్రిల్లర్‌కు సామ్ సీఎస్ సంగీతం అందిస్తుండగా, హరీష్ కన్నన్ సినిమాటోగ్రఫీ, కార్తీక శ్రీనివాస్ ఎడిటింగ్, శివ కామేష్ డి ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ఇదెక్కడి ట్విస్ట్.. హనుమాన్ సీక్వెల్లో మెగా హీరో..!

ప్రశాంత్ వర్మ డైరెక్షన్‌లో వచ్చిన బ్లాక్‌బస్టర్ మూవీ హనుమాన్. తేజ సజ్జా హీరోగా వచ్చిన ఈ సినిమా.. బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచింది. దీంతో ఈ మూవీకి సీక్వెల్ జై హనుమాన్ ఇప్పటికే ప్రకటించారు. ప్రస్తుతం సీక్వెల్‌తో ఫుల్ బిజీగా ఉన్నారు ప్రశాంత్ వర్మ. ఈ చిత్రంలో కాంతార ఫేమ్ రిషబ్ శెట్టి హనుమంతుడిగా కనిపించనున్నారు.

తాజాగా ఈ సీక్వెల్ తెరకెక్కుతుండగానే టాలీవుడ్‌లో మరో బిగ్ ప్రాజెక్ట్ అనౌన్స్ చేశారు. మెగా హీరో వైష్ణవ్ తేజ్ లీడ్ రోల్లో హనుమాన్- ది రైజ్ ఆఫ్ వానరాస్(హనుమాన్-2) మూవీ ప్రకటించారు. ఈ చిత్రానికి వీఐ ఆనంద్ దర్శకత్వం వహిస్తుండగా.. ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లో నిర్మిస్తున్నారు. దీంతో టాలీవుడ్ ఫ్యాన్స్ డైలామాలో పడ్డారు. అసలు ఇది హనుమాన్ సీక్వెల్ మూవీనా?.. లేదంటే కొత్త ప్రాజెక్ట్ అనౌన్స్ చేశారా అనేది తెలియాల్సి ఉంది. ప్రశాంత్ వర్మ డైరెక్షన్‌లో వచ్చిన హనుమాన్ నిర్మాణ సంస్థ ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ ప్రాజెక్ట్ ప్రకటించడం మరో విశేషం. అయితే అయితే పార్ట్ -1 నిర్మించిన ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్స్ వారు కూడా ఇప్పుడు ‘హను మాన్ 2’ ని మరో హీరోతో తీసుకురాబోతున్నట్టుగా ఇటీవల రూమర్స్ గట్టిగా వినిపించాయి. తాజాగా అదే సమయంలో వాటిని నిజం చేస్తూ మేకర్స్ బిగ్ అప్‌డేట్ ఇచ్చి షాకిచ్చారు. మెగా యంగ్ హీరో పంజా వైష్ణవ్ తేజ్ హీరోగా పెట్టి హనుమాన్- 2 ప్రీ లుక్ పోస్టర్ రిలీజ్ చేయడం టాలీవుడ్‌లో ఆసక్తిగా మారింది.



కూతురితో సరదాగా .. ఎమోషనల్ పోస్ట్ షేర్ చేసిన అల్లు అర్జున్!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన సినిమాలతోనే కాకుండా కుటుంబానికి సంబంధించిన మధురమైన క్షణాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. ముఖ్యంగా తన పిల్లలతో కలిసి గడిపే సమయానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ అభిమానులను ఆనందపరుస్తుంటారు. తాజాగా తన గారాల పట్టి అల్లు అర్హా పుట్టినరోజు సందర్భంగా అల్లు అర్జున్ చేసిన ఓ ప్రత్యేక పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నేడు అల్లు అర్హా పుట్టినరోజు కావడంతో బన్నీ తన కుమార్తెకు ప్రత్యేకంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అల్లు అర్హాతో కలిసి ఉన్న ఓ అందమైన ఫొటోను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. ఈ ఫొటోకు అదిరిపోయే క్యాప్షన్ కూడా జోడించారు. నా జీవితంలోని ఆనందానికి పుట్టినరోజు శుభాకాంక్షలు” అంటూ చూశ్రీశ్రీబాతీమ్ము హ్యాష్‌ట్యాగ్‌తో తన ప్రేమను వ్యక్తం చేశారు. తండ్రిగా తన కుమార్తెపై ఉన్న ప్రేమను ఈ చిన్న మాటల్లో ఎంతో అందంగా తెలియజేశారు. ఈ పోస్ట్ షేర్ చేసిన కొద్ది సమయంలోనే అభిమానుల నుంచి భారీ స్పందన వచ్చింది. ఇప్పటికే ఈ ఫొటోకు 3 లక్షలకు పైగా లైక్స్ వచ్చాయి. పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు అల్లు అర్హాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. అల్లు అర్జున్‌కు సంబంధించిన ఈ ఫ్యామిలీ పోస్ట్ అభిమానులను ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. తెరపై స్టైలిష్ స్టార్‌గా, మాస్ హీరోగా కనిపించే బన్నీ.. వ్యక్తిగత జీవితంలో తన పిల్లలతో ఎంతో ప్రేమగా ఉండే తండ్రిగా కనిపించడం అభిమానులకు ఆనందాన్ని కలిగిస్తోంది. ఇక అల్లు అర్జున్ సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం ఆయన అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ ఫాంటసీ యాక్షన్ చిత్రం ‘రాకా’లో నటిస్తున్నారు. ఈ సినిమాలో దీపికా పదుకొణె కథానాయికగా నటిస్తోంది. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. దీంతో పాటు దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో కూడా అల్లు అర్జున్ ఓ సినిమా చేయాల్సి ఉంది. ఇలా వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న బన్నీ.. మరోవైపు కుటుంబానికి కూడా తగినంత సమయం కేటాయిస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

సుకుమార్‌తో రామ్ చరణ్.. రహస్య ప్రదేశానికి చెర్రీ...!





మెగాస్టార్ తనయుడు రామ్ చరణ్ మరో మూవీకి రెడీ అయిపోయారు. ఈ ఏడాది పెద్దితో అలరించిన చెర్రీ.. సుకుమార్ దర్శకత్వంలో నటించనున్నారు. ఈ సినిమా ఇటీవలే పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. ఈ చిత్రాన్ని ప్రస్తుతం ఆర్సీ17 వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కించనున్నారు. ఈ డిసెంబర్ నుంచే షూటింగ్ సెట్స్‌పైకి వెళ్లనునున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే రామ్ చరణ్‌కు సంబంధించిన ఓ క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సుకుమార్ మూవీ కోసం ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫామ్ అయ్యేందుకు రెడీ అయినట్లు తెలుస్తోంది. దాదాపు మూడు రోజుల పాటు తన లుక్‌ను మార్చుకునేందుకు విరామం తీసుకున్నట్లు సమాచారం. ఎవరికీ తెలియని ఓ సీక్రెట్ లోకేషన్‌లో రామ్ చరమ్ ట్రాన్స్‌ఫార్మేషన్‌కు సిద్ధమవుతున్నారని టాక్. ఇందుకోసం ప్రత్యేకంగా ట్రైనర్, చెఫ్‌లతో సహాయక సిబ్బంది రామ్ చరణ్‌తోనే ఉండనున్నారు. ఈ మూవీ కోసం రామ్ చరణ్ పూర్తిస్థాయిలో సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈ సినిమా కోసం పెద్ది సినిమాలోని లాంగ్ హెయిర్‌ను వదిలేసి లావుతగ్గడం మొదలెట్టారు. తాజాగా రామ్ చరణ్ ఎయిర్‌పోర్ట్‌లో వెళ్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలవుతోంది. రంగస్థలం తర్వాత వీరిద్దరి కాంబోలో వస్తోన్న మూవీ కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి